# వైఎస్ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ బదిలీలు

**కడప, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

వైఎస్ఆర్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా జి. గణేష్ కుమార్ నియమితులయ్యారు. సిసిఎల్ఏ నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. వైఎస్ఆర్ కడప జిల్లా జెసి జివిఎంఎసి కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా హిమాన్షు కౌశిక్ ( 2018 ఐఏఎస్) బ్యాచ్ చెందిన హిమాన్షు కౌశిక్ నియమించారు. ప్రస్తుతం ఉన్న జేసీ తమీమ్‌ను అన్సారియాను తదుపరి పోస్టింగ్ కోసం రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈమె శెలవులో ఉన్నట్లు తెలుస్తోంది.


వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 07 ఏప్రిల్ 2023


# బావిలో పడిన యువకుని మృత దేహాన్ని బయటకు తీసిన పోలీసులు



**లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

మండలంలోని కాకులవరం సమీపంలోని ఓ బావిలో రాయచోటి మంగళపల్లికి చెందిన ఐదు మంది యువకులు బుధవారం ఈతకు వచ్చారు. వీరు మద్యం సేవించి బావిలో ఈత కొడుతుండగా వీరిలో తిరుపతి దేవేంద్ర (17) అనే యువకుడు గల్లంతయ్యాడు. దీంతో సమాచారం అందుకున్న లక్కిరెడ్డిపల్లె ఎస్సై వినోద్‌కుమార్ తమ సిబ్బందితో రాత్రి అంతా బావిలో గాలించి ఎట్టకేలకు గురువారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీశారు. దీంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు

## వైభవంగా శ్రీ ఆదిచెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం

IVలో

# వైభవంగా కోదండరాముని రధోత్సవం

## రామనామ స్మరణలతో మార్మోగిన పుర వీదులు



**ఒంటిమిట్ట, ఏప్రిల్6, ప్రభాతవార్త:**

ఒంటిమిట్ట కోదండరామస్వామి వారి శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాల్లో బాగంగా ఏడో రోజు గురువారం స్వామివారు రధోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన రధోత్సవం సాయంత్రం 5 గంటలకు ముగిసింది.సీతారామలక్ష్మణులు సమేత కోదండరాముల వారు రధాన్ని అదిష్టించి గ్రామ పురవీదుల్లో విహారించారు.భజన బృందాల చెక్కభజనలు కోలాటలు చేసు ఒడగా భక్తులు రధాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పలికారు ఆత్మరదికుడు శరీరమే ఉధం బుద్ధి సారది మనస్సు పగ్గ ఇంద్రియాలే గుర్రాలు విషయాలే వీదులు ఈ రీతిలో శరీరాన్ని రధంతో పోల్చ దంతో స్థూల శరీరం వేరని ఆత్మ అందుకు బిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలు గుతుంది. రదోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజానమిదే. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు,ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుం జయ, సిఐ పురు షోత్తంరాజు, యస్ఐ మదుసూదన్‌రావు, మండల ఆధికారులు, భక్తులు పాల్గోన్నారు.

# ప్రజలందరికీ నాణ్యమైన వైద్యసేవలు

## - కలెక్టర్, ఎమ్మెల్యే



**దువ్వూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

గ్రామాల్లోని ప్రజలందరికీ ఆధునిక వైద్యం ఉచితంగా తాముంటున్న ఊర్లలోనే నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమమని జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అన్నపుసాత్రపుపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మంచానికి పరిమితం అయిన రోగులకు సైతం వారి ఇంటి వద్దకే వచ్చి అవసరమైన మందులు అందజేయాలనే తపనతో ఈ విధానానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలోని ప్రతి మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కేటాయించి ఒక్కో ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు, ఒక 104 వాహనం అనుసంధానం చేయబడి ఉంటుందన్నారు. ఒక డాక్టర్ ఆరోగ్య కేంద్రంలో ఉంటే మరో డాక్టర్ ప్రతి రోజు తనకు కేటాయించిన గ్రామంలో డా.వైఎస్ఆర్ విలేజ్ హెల్త్‌క్లినిక్, అంగన్‌వాడీ, తదితర వాటిని సందర్శించి వైద్యసేవలు అందిస్తారన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు మంచి వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. రోగికి, వైద్యునికి అవగాహన కూడా ఉంటుందన్నారు. వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లో 18 రకాల వైద్య సేవలు, 63 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇంకా అవసరమైతే జిల్లా ఆసుపత్రికి కూడా వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మంచాన ఉన్న రోగుల సందర్శన, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, రక్తహీనత పరీక్షలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ సేవలు తదితర కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం వేలాది రూపాయలు జీతాలు ఇచ్చి సిబ్బందిని ఏర్పాటు చేసిందని అయితే ప్రజలు వాటిని వినియోగించుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. అనంతరం అక్కడే రూ.21లక్షలతో నిర్మించిన ఆర్‌బీకేని, రూ.17లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లను ప్రారంభించారు. ఆర్‌బీకే వద్ద వారు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం అనేక పథకాలున్నాయని నాణ్యమైన విత్తనాలు తదితర సౌకర్యాలు అందజేస్తున్నారని తెలిపారు. రైతన్న సేవలకే అన్ని రకాల సేవలు రైతు భరోసా కేంద్రాల్లో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకొని పంటల బీమా తదితర సౌకర్యాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ జయచంద్రారెడ్డి, జడ్పీటీసీ ఏరువ కృష్ణారెడ్డి, జిల్లా వైద్యాధికారి నాగరాజు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి ఉమామహేశ్వర్‌కుమార్, తహసీల్దార్ రమాకుమారి, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి, రాధ తదితరులు పాల్గొన్నారు.

# మే 10 లోగా హద్దురాళ్ళునాటే పక్రియ పూర్తి కావాలి

## రీ సర్వే మొదటి దశలో పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్ళు నాటే పక్రియను వేగవంతం చేయండి

## ప్రతి రోజు ఒక రోవర్ 50 హద్దు రాళ్ళు పాతాలి - ప్రతి రోజు ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించాలి

## నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవు - తహసీల్దార్లు, మండల సర్వేయర్లను ఆదేశించిన కలెక్టర్‌గిరీషా పిఎస్



**రాయచోటి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రీసర్వేలో భాగంగా మే 10లోగా హద్దురాళ్ళు నాటే ప్రక్రియ పూర్తి కావాలని ఆర్డీఓలు, తహసీల్దార్ లు, మండల సర్వేయర్లను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టర్ బంగ్లా నుంచి రీసర్వే హద్దురాళ్ళు నాటే ప్రక్రియ పురోగతిపై కలెక్టర్ గిరీషా పిఎస్ వర్చువల్ విధానంలో ఆర్డీఓలు, తహసీల్దార్‌లు, మండల సర్వేయర్‌లతో సమీక్ష నిర్వహించారు. లికలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ, డిఆర్ ఓ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... అన్నమయ్య జిల్లాలో మొదటి దశలో 84 గ్రామాలలో రీసర్వే ప్రక్రియ పూర్తి చేసామన్నారు. ఇందులో అత్యంత ప్రాధాన్యతమైనటువంటి ప్రక్రియ స్టోన్స్ నాటేది ఉందని, జిల్లాలో 57,040 స్టోన్స్ నాటాల్సి ఉందన్నారు. హద్దురాళ్ళు నాటే ప్రక్రియలో ప్రతి మండలానికి ఇచ్చినటువంటి టార్గెట్‌ను అచీవ్ కావాలన్నారు. డైలీ టార్గెట్ అచీవ్ కాకుండా పెండింగ్ పెట్టుకుంటే వేటు తప్పదని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. గవర్నమెంట్ రీసర్వే ప్రక్రియ పై చాలా సీరియస్‌గా తీసుకొని పనిచేస్తుందని, ఆ దిశగా అధికారులు అందరూ బాధ్యతతో క్రియాశీలకంగా పని చేయాలన్నారు. మండల సర్వేయర్ల దగ్గర ఉన్న రోవర్లు స్టోన్ ప్లాంటేషన్‌కి మాత్రమే ఉపయోగించాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా రోజు రోజుకి పురోగతి కనిపించేలా పనిచేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ మాట్లాడుతూ రీసర్వేలో మొదటి దశలో పూర్తయిన గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ కోసం 52 టీములను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఒక రోవర్ 50 స్టోన్స్ పాతాలన్నారు. ప్రతిరోజు ప్రోగ్రెస్ మీద సీసీఎల్ఏ పర్యవేక్షణ చేస్తుందన్నారు. వీరబల్లి మండలం ఓదివీడులో రెండు టీములు ఉన్నాయి....రెండు రోవర్స్ ఉన్నాయి 50 రాళ్ళు మాత్రమే నాటారని ఇందులో పురోగతి కనిపించాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ మీద తహసిల్దార్లు సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. ఎక్కడైనా రైతులకు సమస్యలు ఉంటే తహసీల్దార్ లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి అక్కడికక్కడే ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. స్టోన్స్ జిల్లాకు చేరిన వెంటనే మండలాలకు చేర్చి మరుసటి రోజు పనులు మొదలు పెట్టాలన్నారు. ఈ వీసిలో ఆర్డీఓలు, తహసీల్దార్ లు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి వైద్యం ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలి : ఎమ్మెల్యే డా॥ సుధ



104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా॥ సుధ.

**బ్రహ్మంగారి మఠం, ఏప్రిల్ 06 ప్రభాతవార్త :**

వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చారని ఎమ్మెల్యే డా॥ సుధ అన్నారు. గురువారం బద్వేలు మండల పరిధిలోని అనంతరాజుపురం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను ఎమ్మెల్యే డా॥ సుధ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ వైద్యాన్ని ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ విధానాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల ముంగిటకే వైద్య సేవలందించే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అనేక రకాల వైద్య సేవలను ప్రజల ముంగిటకే తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో గ్రామీణ ప్రాంతాలలో ఏదైనా అనారోగ్య సమస్యలు ఏర్పడితే పట్టణాలకు వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకునే పరిస్థితి ఉండేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకొని గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ముంగిటకే వైద్య సేవలందించే విధంగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సదవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 104 వాహనం ద్వారా వైద్య సేవలను వినియోగించుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఖాదర్ వల్లి, డిప్యూటీ డిఎంహెచ్‌వో చంద్రహాస రెడ్డి, తొట్టిగారి పల్లె ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, గ్రామ సర్పంచ్ గంగమ్మ, ఎంపీటీసీలు, బంగారు శీనయ్య, పుత్తా శ్రీరాములు, ఎంపీడీవో రామకృష్ణయ్య, వైద్య సిబ్బంది జనార్ధన్‌తో పాటు పలువురు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీల పాలనకు రెండేళ్లు పూర్తి

## సర్పంచుల్లో నిర్వేదం - ఏకగ్రీవ పంచాయితీలకు అందని నజరానా



**రాయచోటి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టి రెండేళ్లు అయింది. వాస్తవ పరిస్థితులు చెప్పుకొని సర్పంచులు అంతర్మాదనం చెందుతున్నారు గ్రామ పాలనలో తమ ముద్ర కనిపించేలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రెండేళ్ల క్రితం కొలువుదీరిన పాలకులకు నిరాశే మిగిలింది ఆర్థిక సంఘ నిధులతో అవసరమైన పనులు చేపట్టాలని సంకల్పంతో కార్యాచరణకు సిద్ధమైన సర్పంచులకు ఖాళీ ఖజానాలు వెక్కిరిస్తున్నాయి. పంచాయతీ ఖాతాల్లో ఉన్న 14, 15వ ఆర్థిక సంఘ నిధులు మూడో కంటికి తెలియకుండా ప్రభుత్వం విద్యుత్ బకాయిలకు మళ్లించుకుంది. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సహక నజరానా కూడా ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొంది. గత రెం డేళ్లుగా గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారిపోయామని ఆవేదన సర్పంచుల వ్యక్తం అవుతుంది. గ్రామంలో ఏ సమస్య నెలకొన్న ప్రజలు వెంటనే సర్పంచులు దృష్టికి తీసుకెళ్తున్నారు. దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ చాలా కీలకమైనది పంచాయతీ ఖాతాలు ఆర్థిక సంఘం నిధులు సాధారణ నిధులు ఉన్న వాటిని వినియోగించుకోలేని పరిస్థితిలో సర్పంచులు ఉన్నారు. ఫలితంగా ఏ పనులు చేయలేని పరిస్థితి నెలకొంది గ్రామ పంచాయతీలకు ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బాధ్య తలు స్వీకరణ కోసం నెల రోజులు ఎదురు చూసి 2021 ఏప్రిల్ మూడో తేదీన బాధ్యతలు చేపట్టారు అనంతరం నెల తర్వాత చెక్ పవర్ ఇచ్చారు ఎన్నో ఆశలతో బాధ్య తలు చేపట్టిన సర్పంచులకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు తలనొప్పిగా మారాయి అధికార పార్టీ సర్పంచులు ప్రభుత్వ విధానాల పట్ల అసంతృప్తితో రగిలిపోతున్న పైకి చెప్పుకోలేని నిస్సహాయ స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నజరానాను ప్రకటించింది ప్రభుత్వం ఇచ్చే నజరానాతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని సత్సంకల్పంతో పలు గ్రామాలు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి 2021 ఏప్రిల్ మూడో తేదీ పంచాయతీ పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టాయి అప్పటినుండి ప్రోత్సాహ నిధుల కోసం ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు అయితే ఎన్నికల జరిగి రెండేళ్లు గడుస్తున్నా నేటికి ప్రభుత్వం ప్రకటించిన నజరానా నేటికీ ప్రభుత్వం విడుదల చేయలేదు పంచాయతీ పాలక వర్గాలు బాధ్యతలు చేపట్టి రెండేళ్లయిన నిధుల లేని కారణంగా ఒక్క పని పంచాయతీల్లో చేసే వీలు లేక ఇక్కట్ల పాలవుతున్నాయి పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం గుంజేసుకుంటుంది. దీంతో పంచాయతీల్లో కనీస పారిశుద్ధ చర్యలు చేపట్టేందుకు నిధులు అందుబాటులో లేక పంచాయతీ సర్పంచులు సతమతమవుతున్నారు. ఆర్థిక సంఘం నిధుల నుంచి ఇప్పటికే రెండు విడతలగా విద్యుత్ బకాయిలు చెల్లించిన ఇంకా బకాయిలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తాజాగా అధికారులు అందుబాటులో ఉన్న నిధులను చెల్లించాలంటూ వీ సి ద్వారా మౌఖికాదేశాలు జారీ చేశారు మరో విడత పంచాయతీలకు జమ కావలసిన నిధులకు రెక్కలు వచ్చాయి, పంచాయతీ ఖాతాల్లో ఉన్న నగదును విద్యుత్ బిల్లుల రూపంలో చెల్లించి మిగిలిన పనులకు నగదు ఎక్కడి నుంచి తీసుకురావాలని సర్పంచులు కార్యదర్శులు ప్రశ్నిస్తున్నారు. నిధుల మళ్లింపు పై సర్పంచులు ఉద్యమానికి సిద్ధమవుతున్న తరుణములో ఉద్యమంలో అధికార పార్టీ సర్పంచులు కూడా భాగస్వాములు అవుతున్నారు. ప్రభుత్వం పంచాయతీ నిధులు విషయంలో మరోసారి పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై ఉన్న ఆంక్షలు తొలగించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచులు కోరుతున్నారు.

# ప్రభుత్వ శాఖల వారీ లక్ష్యాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేలా కృషి

## కలెక్టర్ గిరీషా పిఎస్.

## ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల లక్ష్యాలను వందశాతం సాధించాలి

## కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే.ఎస్. జవహర్ రెడ్డి ఆదేశాలు





**రాయచోటి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాలను నిర్దేశించిన కాల పరిమితిలోగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి కి వివరించారు. గురువారం విజయవాడలోని ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలలో సమీక్షించారు. ఇందులో రెవిన్యూ అంశాలలో భాగంగా రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, వ్యవసాయం, ఉద్యానవనం, అనుబంధ రంగాలు, గృహనిర్మాణంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేఅవుట్ల వారీగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణ ప్రగతి, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై జిల్లాల వారీగా కలెక్టర్లతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేలో భాగంగా మొదటి దశ పూర్తి చేసిన గ్రామాలలో మే 10 లోపు రీసర్వే రాళ్లను తప్పనిసరిగా పాతించాలన్నారు. ఇందుకు ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా వెబ్ ల్యాండ్ లో రీ సర్వే పూలింగ్ డేటాను, రాళ్లు పాతిన డేటాను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారులకు భూసేకరణ పూర్తి చేసిన వాటికి 3జీ అవార్డ్స్ పాస్ చేసి, లబ్ధిదారులకు వేగవంతంగా పరిహారం పంపిణీ చేయాలన్నారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు వారీగా ఎంత భూసేకరణ చేయాలి, ఎంత సేకరించారు, మిగిలినది ఎంత, పరిహారం చెల్లింపు ఎంత చేశారు, ఇంకెంత చేయాల్సి ఉంది, అందుబాటులో ఉన్న నిధులు, ఇంకనూ అవసరమైన నిధులు ఎంత కావాలి తదితర అంశాలలో అధికారులతో సమీక్షించారు. వ్యవసాయం మరియు ఉద్యానవన రంగాలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ లలో ప్రగతిని సమీక్షించారు. యంత్ర సేవా పథకం కింద అన్నమయ్య జిల్లాలో ఇప్పటివరకు 141 రైతు గ్రూపులను ఏర్పాటు చేశారని, మిగిలిన చోట కూడా రైతు గ్రూపుల ఏర్పాటు, సిహెచ్సి యూనిట్ల ఏర్పాటు, యూనిట్లకు సంబంధించి బ్యాంక్ అకౌంట్ల ప్రారంభం తదితరాల్లో ప్రగతిని సమీక్షించారు. మినీ ఫిష్ రిటైల్ యూనిట్ల మార్కెటింగ్ అంశాలపై కూడా కలెక్టర్ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గృహ నిర్మాణంలో భాగంగా లేఅవుట్ వారీగా ఇళ్ల పట్టాల గృహ నిర్మాణ ప్రగతిని, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన వివిధ అంశాలపై సమీక్షించారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాలలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఇందుకు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాలు, మండలాలు, పంచాయతీలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమిమ్ అన్సారీయా, డిఆర్ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాదెల చెరువు ఆక్రమణ

## - గాడి తప్పిన పర్యవేక్షణ - పట్టించుకోని ఇరిగేషన్‌శాఖ

## - సంబంధంలేనట్లు రెవెన్యూ

## - యథేచ్ఛగా వందల ఎకరాలు చెరువుల భూమి ఆక్రమణ

## - దృతరాష్టుని పాత్ర పోషిస్తున్న ఇరిగేషన్ అధికారులు



**ఓబులవారిపల్లె, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**





గాదెల రెవెన్యూ గ్రామమైన గాదెల ఎర్ర చెరువుకు ఒక ప్రత్యేక ఉంది. ఈ చెరువు కింద ఆయకట్టు చెరువుతో పండే పంటలు లేకపోయినప్పటికీ గత ప్రభుత్వంలో 2000 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆ గ్రామానికి చెందిన ఓ తెదేపా నాయకుడు మంత్రిగా సరస్వతమ్మ ఉన్న సమయంలో లక్షలాది రూపాయలు చెరువు నిర్మాణం పనులకు పనికి ఆహారం పథకం కింద కొన్ని టన్నుల బియ్యం, కొంత నిధుల రూపంలో లక్షలాది రూపాయలు వెచ్చించి గాదెల ఎర్రచెరువును, కుంటను నిర్మించారు. ఆ తరువాత 2014 కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొంత చెరువు అభివృద్ధి పనులు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 2019-20 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.కోటి పైచిలుకు నిధులు చెరువు పూడిక తీత పనులకు మంజూరైంది. ఆ చెరువు పూర్తిగా ఆక్రమణదారుల కబందహస్తాల్లో ఉండడంతో పాటు అదే గ్రామానికి చెందిన కొందరు బడా బాబులు చిన్న, సన్నకారు రైతులభూమిని ఆక్రమించి ఉద్యాన పంటలైన అరటి, బొప్పాయి, మామిడి, దోస, కర్బూజ పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటలు పూర్తయిన తరువాత గాదెల చెరువు పూడికతీత అభివృద్ధి పనులు చేపట్టాలనే వైసీపీ నాయకుల ఆకాంక్ష రోజు రోజుకు నీరుగారుతోందని చెప్పవచ్చు. రైతులు పంటల మార్పిడి సాగు చేస్తూ చెరువు భూమిని వదలకుండా పంటలు సాగు చేస్తున్నారు. ఆక్రమించిన భూములకు సంబంధించిన రైతులకు సంబంధిత ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వకుండా నిమ్మకు నీరెత్తినట్లు చెవిటి వాడి ముంగిటన శంఖం ఊదిన చందంగా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు మెండుగా ఉన్నాయి. అంతే కాకుండా నిద్రిస్తున్న వ్యక్తని లేపచ్చుకానీ, నిద్రిస్తున్నట్లు నటిస్తున్న వారిని లేపడం కష్టమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరో పక్క రెవెన్యూ అధికారులు చెరువు విస్తీర్ణం, కుంట విస్తీర్ణం ఏయే సర్వే నెంబర్లలో ఎంత విస్తీర్ణం కలిగిన బూములు ఉన్నాయి తదితరవిషయాలు తెలపకుండా కొందరు పొంతన లేని సమాధానాలు ఇవ్వడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఏది ఏమైనా చెరువులు, కుంటలు ఆక్రమించడంతో వర్షం నీరు చెరువుకు అందే దారులు పూడిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం లేకపోలేదు. కనుక ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకొని చెరువు ఆక్రమిత రైతులకు నోటీసులు జారీ చేసి ఆక్రమణలను తొలగించి చెరువు పూడికతీత అభివృద్ధి పనులు చేపట్టి వర్షపు నీరు చెరువుకు అందేలా అడవి నుంచి కాలువలు తీసి చెరువుకు నీరు ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామస్థులు, గాదెల గ్రామస్తులు కోరుతున్నారు. అంతేకాకుండా చెరువు సర్వే నెంబరు 622 నుంచి పదుల సంఖ్యలో వివిధ సర్వే నెంబర్లలో వందల ఎకరాల భూములు ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఈ భూములు పట్టాలకు కొందరు సర్కారు బ్యాంకు అధికారులను సంప్రదించి ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు రికార్డులు సృష్టించి బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆ తరువాత కొంత మంది అనామకుల పేర్లు పెట్టి బినామీలతో రుణం కట్టలేరని సహకార బ్యాంకుల అధికారులతో ఓపాయికారి ఒప్పందాలు కుదుర్చుకొని వేలం పాటలో ఈ భూములు పాడి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు సమాచారం. అయితే తీగ లాగితే డొంక కదిలినట్లు కొందరు అధికారులు నీళ్ల నములుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఉప్పు తిన్న వారు ఎప్పటికైనా నీల్లు తాగక తప్పదని అదే విధంగా తప్పు చేస్తే శిక్షార్హుడవుతాడని పలువురు మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఈ కబ్జాల వెనక అదో కిటుకు అన్న సామెత నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

**అధికారులను వివరణ కోరగా..**

అన్ని విధాలా చెరువులు, భూములు, ఆయకట్టు విషయంలో తమ వంతు రెవెన్యూ పరంగా రైతులకు నోటీసులు ఇవ్వడం, ఎక్కడైనా మట్టిని తరలించినా వాటిని అడ్డుకోవడం తమ వంతు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు పీర్‌మున్నీ తెలిపారు. అయితే ఇరిగేషన్ అధికారులను సమాచారం తెలుసుకోవాలని ఫోన్ ద్వారా సంప్రదించగా ఆ అదికారులు అందుబాటులో లేరు.

# అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి..

## ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



**సంబేపల్లె, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్ అని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సంబేపల్లె మండలం గుట్టపల్లె గ్రామంలో ఆర్.కె.నగర్, బట్టావాండ్లపల్లెలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ ఆవుల నాగశ్రీ లక్ష్మీ, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిదంబం రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పొత్తూరి రవీంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ బట్టా ప్రభాకర్ నాయుడు, సర్పంచ్ పాల వెంకటరమణ నాయుడులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని పల్లెల్లో ప్రతి గడపకు శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి ప్రజా సమస్యలు ఆరా తీయడంతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ మూడున్నరేళ్ల కాలంలో 98% పైగా నెరవేర్చారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నా ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా చెప్పిన సమయానికి ముందుగానే సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు. అర్హతే ప్రమాణికంగా, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను సీఎం జగన్ అందిస్తున్నా రన్నారు.

**ప్రతి ఇంటికి రెండు, మూడు సంక్షేమ పథకాలు లబ్ధి..**

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం హృద్యమైన సన్నివేశాలకు వేదిక అవుతోంది. మూడున్నరేళ్ల పాలనను వివరిస్తూ శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లినప్పుడు ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందడంపై ఆరా తతీయగా ప్రతి ఇంటికి 2, 3 పథకాలు అందినాయంటూ ప్రజలు చెప్పడం జరిగిందన్నారు. నెల నెలా 1వ తేదీనే పొద్దు పొడవక ముందే పెన్షనర్లను ఇంటికి పింఛను చేరుస్తున్నారని అవ్వా తాతలు చెబుతూ సీఎం జగన్ చల్లంగా ఉండాలంటూ దీవించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మహేశ్వరి భాయి, ఎంపీడీవో నంసింహులు, మండల వ్యవసాయ సలహా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, సర్పంచ్‌లు అమర్‌నాథరెడ్డి, దండు నాగభూషణ్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, మాజజీ ఎంపీటీసీ సుధాకర్ నాయుడు, రాళ్లపల్లె రవీంద్ర నాయుడు, కంబెల్ల ఆంజనేయులు, సహదేవ నాయుడు, ఉమాకుమార్, మోహన్‌రెడ్డి, హేమసుందర్, వెంకట సిద్ధారెడ్డి, అన్నారెడ్డి, వసంత శ్రీనివాసులు రెడ్డి, శెట్టిపల్లె ఎర్రపురెడ్డి, బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీకరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వాయల్పాటి ఆనంద్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శివయ్య, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బుల్లి వెంకటరమణ, శివవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్టు రెయింజ్ అధికారిగా మదన్‌మోహన్‌రెడ్డి

**మదనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



మదనపల్లె ఫారెస్టు రేయింజ్ అధికారి (ఎస్ఆర్ఓ)గా మదన్‌మోహన్‌రెడ్డి గురు వారం భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన వలేకర్లతో మాట్లాడుతూ గతంలో కుప్పం ఎస్ఆర్ఓ గా విధులు నిర్వహించానని డిపుటేషన్‌పై మదన పల్లెకు బదిలీ అయ్యానన్నారు. వేసవిలో వణ్య మృగాలకు తాగునీరు అందేటట్లు చేయడంతో పాటు అడవులు అగ్నికి ఆహుతి కాకుండా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ మదనహమోహన్, సెక్షన్ అధికారులు. బీటాఫీసర్లు పాల్గొన్నారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్..?

### విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు
### చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు

**మదనపల్లెక్రైం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**

ఓపెన్‌టెన్త్, ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో జోరుగా మాస్ కాఫీయింగ్ జరుగు తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. పరీక్షలకు గానూ ఒక్కో విద్యార్థినుంచి రూ.500నుంచి వెయ్యి వరకునగదు వసూలు చేసినట్లు సమాచారం. పరీక్షల సమయంలో విద్యార్థులకు బయట నుంచి జవాబుపత్రాలు పంపిస్తున్నట్లు ఆరో పణలున్నాయి. దీంతో విద్యార్థులు ఓపెన్ పరీక్షా రాస్తున్నట్లు దుష్ ప్రచారం జరుగుతోంది. ఈనెల 3నుంచి మదనపల్లెలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. కోటబడి, బాపూజి, వివేకానంద మున్సిపల్ హైస్కూల్, ప్రభు త్వ బాలికల ఉన్నత పాఠశాల జడ్పీహైస్కూల్ రెండు కేంద్రాలతో కలపి మొత్తం ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మద్యాహ్నం 2.30నుంచి సాయం త్రం 5.30గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. అర్థాంతరంగా చదువు ఆగిపోయి, మద్యలో మానేసిన విద్యార్థుల కోసం ప్రభుత్వం ఓపెన్ పరీక్షలను, రెగ్యులర్ టెన్త్ తరహాలో నిర్వహిస్తున్నారు. అయితే ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేసే క్రమంలో ఓపన్ పరీక్షలు రాయించి అంతరినీ పాస్ చేయాలనే ఉద్దేశ్యంతో ఒక్కో విద్యార్థి నుంచి నగదు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తాన్ని విద్యా శాఖ ఉన్నతధికారులకు ముట్టచెప్పి వారి అనుమతితో పరీక్షహాలులోకి స్లిప్‌లతో సమన్వయం చేసుకొని కేంద్రాల్లో ఓపెన్‌గా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. పరీక్షల తీరును పరిశీలించడానికి ఎలాంటి సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాల్ ఏర్పాటు చేయకపోవడం పలువిమర్శలకు తావిస్తొంది. కొంతమంది ఎనిమిది లీటర్ల అదే గదిలో బాగా చదివిన విద్యార్థులు రాసిన ప్రశ్న పత్రాలను ఇతరులకు అందజేస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. మాస్ కాపియింగ్ జరుగుతుండడంతో కష్టపడి చదివిన విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందు తున్నా రను. ఇప్పటికైనా జిల్లా అధికారులు చర్యలు తీసుకొని మాస్ కాఫీలను కట్టడి చేయాలని డిమాండ్‌చేస్తున్నారు.

## ధరలు లేక టమోటా రైతు దిగాలు

**రామసముద్రం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**



రామసముద్రం మండలంలోని టమో టా పంట రైతులకు ధరలు లేక వారం రోజులుగా తగ్గుముఖం పడుతుండ దంతో టమోటా రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. గురువారం టమోటా మార్కెట్‌లో పదికిలోల బాక్స్ రెండవ రకం ధర రూ.80లు పలికింది. దిగుబడి తక్కువగా ఉన్న ధరలు పెరగడం లేదంటూ రైతులు వాపోతున్నారు. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ లేక పోవడం వల్ల ధరలు పెరగడం లేదని వ్యాపారస్థులు చెబుతున్నారు. మార్కెట్ యార్డు 200మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చాయి. సాధారణంగా మార్కెట్‌కు 500 నుంచి 600టన్నుల వరకు వచ్చేవి. ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టు బటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతిని నమ్ముకొని భూమి పై ఆధార పడి ఒక పంట పోతే మరో పంట వస్తుదన్న ఆశతో టమోటా పంట వేసి దిగు బడి బాగా వచ్చినా పంటకు గిట్టుబాటు ధర లేదు. చేసిన అప్పులు తీర్చలేక అప్పులు పాలైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్బావ దినోత్సవం

### బిజెవైఎం అధ్యక్షులు గంగరాజు

**రామసముద్రం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



రామసముద్రం మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద మండల బిజెపి అధ్యక్షులు నాగరాజుశెట్టి, బిజె వైఎం అధ్యక్షులు గంగరాజు ఆధ్వర్యంలో బిజెపి ఆవిర్బావ దినోత్స వంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా గురువారం వారు ముందుగా బిజెపి జెండాను ఆవిష్కరించారు. 43వ ఆవిర్బావ దినో త్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆవిర్బావ దినోత్స వంగా సందర్బంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శేఖర్, అశోక్, బాలాజీ, గుంతలపేట చలపతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకలు

**రామసముద్రం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**

రామసముద్రం మండలంలోని హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. హనుమంతుని వైశాఖమాసం, క్రిష్ణపక్షంలో దశమిరోజు జన్మిం చారు. దీంతో స్థానిక హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

## పార్టీ విజయం కోసం పనిచేయాలి

**రామసముద్రం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



పార్టీ విజయమే లక్ష్యంగా వైసిపి నాయకులు ప్రతి ఒక్కరు పనిచేయాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా సూచించినట్లు సచి వాలయ కన్వీనర్ నందకిషోర్‌రెడ్డి తెలి పారు. సంక్షేమ పథకాల లబ్దిని ప్రతి ఇంటికి వెళ్ళివివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయ కులు, మండల సచివాలయ కన్వీనర్ నంద కిషోర్‌రెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడు, సింగిల్‌విండో అధ్యక్షులు కేశవరెడ్డి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, కొండూరు క్రిష్ణారెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి, గంగాధర్‌నాయుడు, సర్పంచ్ జికే.చంద్ర, సర్పంచ్ చరణ్, రవి, తిప్పరాజు, రెడ్డప్పనాయుడు, ఉదయ్‌శంకర్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, అరికల రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ

**కలికిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



కలికిరి మండలంలోని 856 స్వయం సహాయక సంఘాలకు మూడవ విడతలో వైఎస్ఆర్ ఆస రా పథకంలో మంజూరు అయిన రూ.7.72కోట్లు నిధులు చెక్కును గురువారం పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లబ్దిదారులకు పంపిణ చేశారు. గురువారం ఎంఆర్సి భవన ఆవరణంలో వైఎస్ ఆర్ చెక్కుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మె ల్యే హాజరై మాట్లడుతూ రాష్ట్రంలో స్వయంసహాయక సభ్యులకు సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత ఆర్ధిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ ఛైర్మెన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్‌ఖాన్, మండల ఎంపిపి వేంపల్లి నూర్జా హన్, జడ్పిటిసి పద్మజ లోకవర్ధన్, ఎంపిడిఓ గంగయ్య, తహశీల్దార్ బాగ్య లత, వెలుగు సిసిలు ఆంజినేయులు, ప్రభాకర్, చంద్రకళ, బాబాసాహెబ్, మండల ప్రత్యేక ఆహ్వానితులు శివయోగి శివాజి, రత్నశేఖర్‌రెడ్డి, గుట్టపాళ్యం సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే వైఎస్ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ

**కలికిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



కలికిరి మండలంలోని 856 స్వయం సహాయక సంఘాలకు మూడవ విడతలో వైఎస్ఆర్ ఆసరా పథకంలో మంజూరు అయిన రూ.7.72కోట్లు నిధులు చెక్కును గురువారం పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి లబ్దిదారులకు పంపిణ చేశారు. గురువారం ఎంఆర్సి భవన ఆవరణం లో వైఎస్ఆర్ చెక్కుల కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే హాజరై మాట్లడుతూ రాష్ట్రంలో స్వయంసహాయక సభ్యులకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత ఆర్ధికసాయం అందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీకార్పోరేషన్ ఛైర్మెన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్‌ఖాన్, మండల ఎంపిపి వేంపల్లి నూర్జాహన్, జడ్పిటిసి పద్మజ లోకవర్ధన్, ఎంపిడిఓ గంగయ్య, తహశీల్దార్ బాగ్యలత, వెలుగు సిసిలు ఆంజినేయులు, ప్రభాకర్, చంద్రకళ, బాబాసాహెబ్, మండలప్రత్యేక ఆహ్వానితులు శివయోగి శివాజి, రత్నశేఖర్‌రెడ్డి, గుట్టపాళ్యం సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

## పల్లవోలు పంచాయితీని తనిఖీచేసిన డిపిఓ

**కలికిరి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**



మండలంలోని పల్లవోలు పంచా యతీని గురువారం జిల్లా డిపిఓ ధనలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా సచివాలయాన్ని తనిఖీ చేసి పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇటీవల జరిగిన డోన్ భూ సర్వేపై సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం డంపింగ్‌యార్డును పరిశీ లించి తడి, పొడిచెత్త ద్వారాఎరువులు తయారు చేసి పంచాయితీకలు ఆదాయం వచ్చే విధంగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పంచాయితీ లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి ప్రభుత్వం చిన్నపిల్లలకు, గర్బవతులకు సరఫరాచేసే పౌష్టికాహారం లబ్దిదారులకు సక్రమంగా అందుతోందా లేదా అనే దానిపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓఆర్డి అబ్దుల్‌ఖలాం ఆజాద్, పంచా యతీ కార్యదర్శిరెడ్డిప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చేపల కోసం వెళ్ళిన సుధాకర్ మృతదేహం లభ్యం

**నిమ్మనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



నిమ్మనపల్లె మండలంలో మూడు రోజుల క్రితం చేపలకోసం వెళ్ళిన సుధా కర్ గల్లంతైన విషయం తెలిసిందే. గురు వారం శవం దామరవద్దు చెరువులో తేల దంతో రెవెన్యూ, పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మదన పల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. భార్య శశికళ, పిల్లలు దుఃఖసముద్రంలో మునిగారు.

## ముదివేడు భూ నిర్వాసితులకు ఇండ్లస్థలాలు

**కురబలకోట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**



ముదివేడు రిజర్వాయర్ భూ నిర్వా సితులకు త్వరలో ఇండ్లస్థలాలు మంజూ రు చేస్తామని భూసేకరణ స్పెషల్ డిప్యూ టి కలెక్టర్ గోపాల క్రిష్ణ తెలిపారు. గురు వారం పిచ్చలవాండ్లపల్లె గ్రామంలో ముది వేడు నిర్వాసితులతో ముఖాముఖి కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎన్ ఆర్ యాక్టు ప్రకారం నిర్వాసితులైన శీతివారిపల్లె, కొత్తపల్లె గ్రామాలకు చెందిన 260 మందికి ఇండ్లస్థలాలు ఇచ్చేందుకు గుర్తించామని ఆయన తెలిపారు. వారికి ముది వేడు ఠాణామిట్ట వద్ద ఇంటిస్థలాలు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. భూ నిర్వాసితులకు ఆవాసయోగ్యమైన ఇంటిస్థలాలతో పాటు పక్కాగృహలు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, ఆర్ఐ సుగుణ, విఆర్ఓ జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## 8న కలిచెర్ల పోలేరమ్మ తిరుణాల

**పెద్దమండ్యం ఏప్రిల్ 6 ప్రభాతవార్త**

ఈనెల 8న కలిచెర్ల పోలే రమ్మ తిరుణాల ఘనంగా నిర్వహిస్తు న్నట్లు ఎంపిపి పూర్ణచంద్రికారమేష్ తెలి పారు. గతవైభవాన్ని తలపించే విధంగా అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. 10రోజులపాటు మహాభారతం నిర్వ హిస్తామన్నారు. పశువులకు నీటివసతి ఏర్పాటు చేశామన్నారు. కన్నుల పండు వగా చాందినీబండ్లు, బాణాసంచా, మంగళవాయిద్యాలు డ్రమ్స్‌ను ఏర్పా టు చేసి ప్రజలకు ఆనందం,వినోదం అన్నిహంగులతో వైభవంగా పోలెరమ్మ తిరుణాలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ అవగాశాన్ని ప్రజలు వినియో గించుకోవాలని కోరారు. ప్రజలు,భక్తులు విశ్శేషంగా పాల్గొని అమ్మవారికి పూజలు మొక్కు బడులు తీర్చుకోవాలన్నారు.

## ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

**కలకడ, ఏప్రిల్ 6 ప్రభాతవార్తః**

స్థానిక పోలీసుస్టేషన్‌లోని ఏఎస్సై బాలకష్ణ మాట్లాడుతూ మండలంలోని గంగాపురం గ్రామంలో నివాసం ఉన్న వెంకటరమణ, జయమ్మ ఆమె కుమార్తెలు కలిసి గంగాపురం చుట్టుపక్కల ఉన్న భూములలో గొర్రెలు మేపుకుంటూ ఉన్నా రని ఈవిషయం తెలిసిన శ్రీనివాసనాయుడు అదే గ్రామంలో నివాసం ఉన్న కోట శ్రీనివాసులునాయుడు, రామచంద్రనాయుడు, చంద్రయ్యనాయుడులు కలిసి అక్కడికి వెళ్ళి మీరు ఎందుకు మాభూములలో గొర్రెలు మేపుతున్నారని వెంకట రమణను, జయమ్మను వారి కుమార్తెలను నానా దుర్భాషలాడి గాయపరిచారని జయమ్మ కలకడ పోలీసు స్టేషన్ నందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోట శ్రీని వాసలునాయుడు, రామచంద్రనాయుడు, చంద్రయ్యనాయుడులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

**పీలేరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్తః**



మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ మద్దెలచెరువు నందు ఎమ్మె ల్యే చింతల రామచంద్రారెడ్డి గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం గురు వారం ప్రారంభించి ప్రతి ఇంటి వద్దకు వెళ్ళి స్వయంగా మన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రజలకు ఎవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదే శాలు ఇచ్చారు. రాష్ట్రంలో సీఎం పాలన నియోజకవర్గ అభివద్ధి పరిపాలన లో ఎటువంటి లోటు లేకుండా ఉన్నామని గ్రామ ప్రజలు నుంచి విశేష స్పందనల లభించిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వైకాపా నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చేందుకు సహకరించండి

**పులివెందుల, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**



ప్రజల సహకారంతో ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు మెప్మా సిబ్బం ది కృషి చేయాలని పాడా ఓఎస్డీ అనీల్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఆర్డీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమీష నరు నరసింహారెడ్డి, తహసీల్దారు మాధవ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది జగ నన్న హౌసింగ్ కాలనీలో గృహాలు పొందిన లబ్ధిదారులతో కట్టించ వలసిన రూ.35 వేల విషయమై మెప్మా సిబ్బందితో వార్డు సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. సచివాలయాల వారీగా నిర్దేశిం చిన లక్ష్యాలను పరిశీలించారు. ఎక్కువ మంది లబ్ధిదారుల చేత డబ్బులు కట్టిం చిన మెప్మా సిబ్బందిని పేరుపేరున అభినందించారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బం ది పాల్గొన్నారు.

## కుటుంబ వైద్యవిధాన కార్యక్రమం సద్వినియోగం చేసుకుందాం

### ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

**పీలేరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్తః**



వైద్యులు విధాన కార్య క్రమం సద్వినియోగం చేసుకుందామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురు వారం వాల్మీకిపురం మండల పరిధిలోని చింతపర్తి సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టు కార్యక్రమం మొబైల్ మెడికల్ యూనిట్(104)ను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర సీఎం పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు స్పెషలిస్టు సేవలు అందించే ఉద్దేశ్యంతో ప్రతి వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ దగ్గర నిర్దేశిత రోజుల్లో సేవలు అందిస్తారని 105 రకాల మందులు 14 రకాల పరీక్షలు ఉచితంగా అందిస్తారని ప్రతి వాహనంలో డాక్టర్‌తో పాటు 9 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈసీజీ పరీక్షలు కూడా అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టు కార్యక్రమంలో భాగస్వామ్యం కలిగి ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు, డీఎంహెచ్ఓ డాక్టర్ లకవర్ధన్ మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుంచి ప్రతి పీహెచ్‌సీకి 104 వాహనం అందు బాటు లోకి వచ్చాయని ఇప్పుడు ఇంకా ఎక్కువ గ్రామాల్లో సేవలు అందించే వీలుం దని తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు మానస మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ పేద ప్రజల పాలిట వరం అన్నారు. కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ, ఎంపీపీ కిరణ్, వైకాపా యువజన విభాగం నాయకులు ఫారూఖ్, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, ఒరుగంటి రమేష్, నరసింహులు, చెంగల్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మహమ్మద్‌రఫీ, సుధాకర్, పూర్ణమ్మ, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభం

**పీలేరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్తః**



పట్టణంలోని ఫ్యామిలీ డాక్టర్ కార్య క్రమాన్ని గురువారం సర్పంచి డాక్టర్ హబీబ్ బాషా ప్రారంభించారు. గ్రామీణు లకు ఈ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందుతుందన్నారు. యువత మత్తుకు బానిస కాకుండా జాగ్రత్త పడాల న్నారు. పట్టణంలోని మెడికల్ షాపు నందు మెడిసిన్ విక్రయించు వారికి తెలి యజేయడం ఏమనగా కరోనా వ్యాధి సమయంలో దుకాణంలు నడిపి ప్రజలకు సహాయం చేశారన్నారు. కొన్ని దుకాణాల మత్తు పదార్థాల విక్రయాల ద్వారా యువత బానిసై వారి జీవితం నిర్వీర్యం చేసుకున్నారు. తమ దుకాణాలలో ఎటువంటి మత్తుపదార్థాలు విక్రయించకుండా డాక్టర్ సలహా మేరకు ఆరోగ్యంగా యువతను కాపాడుకోవాలన్నారు, అనంతరం గ్రామ సచివాలయం-5 ను సంద ర్శించి వారు ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఇంకా మెరుగైన సేవ లను అందించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు అబీద్, షాజహాన్, నాయకులు మునీర్, నాగార్జున, ఇబ్రహీం, వైద్యులు కార్తీక్, సతీష్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల సారధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

**వేంపల్లె, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**



పేదల అభ్యున్నతికి, సంక్షేమ పథకాల సారధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వేంపల్లె మండల కన్వీనరు కె. చంద్ర ఓబుళరెడ్డి, వేంపల్లె గ్రామ సర్పంచి ఆర్.శ్రీనివాసులు, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు పేర్కొన్నారు. గురు వారం వేంపల్లె నాలుగో సచివాలయంలో వారు గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్య క్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ గోడపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం లోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో సంక్షేమ పాలన అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వాలు పేదల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి వహించలేదన్నారు. కుల, మత, వర్గ, ప్రాంత పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందే విధంగా సుపరిపాలన అందిస్తు న్నట్లు తెలి పారు. గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు ప్రతి గడపగడపకు వెళ్ళి ప్రజలతో మమేకమై వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేయా లన్నారు. గత ఏ ప్రభుత్వం ఏం చేసింది.. ఈ ప్రభుత్వం ఏం చేస్తోంది అన్న అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గత టీడీపీ పాలన ఎలా ఉంది, ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీ పాలన ఉంది అనే వివరాలు ఉంటా యని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, హబీ బుల్లా, బాబా షరీఫ్, బ్రహ్మయ్య, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామగంగిరెడ్డి, రామ కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు గణేష్, బికారి, సునీల్, బాలరాజు, షామీర్ పాల్గొన్నారు.

## సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి

**జమ్మలమడుగు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు పట్టణంలోని రహదా రులుభవనం కార్యాలయం లో జరిగిన సమావేశంలో బీజేపీ ఎస్సీ నాయకులు మేకల ఆంజనేయులు మాట్లాడుతూ పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుట్ల గ్రామంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను అందరి ముందు నిలబెట్టి దారుణంగా అవమానించిన అగ్రవర్ణ ముఖ్యమంత్రి రాష్ట్రంలో దళితులను పురుగుల కంటే హీనంగా చూస్తు న్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజు రోజుకు దళితులకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. మొన్న డా.సుధాకర్, నిన్న డా.అచ్చెన్న మరణాలకు కారణం అయ్యారని రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ కులస్థులు మీ పార్టీకి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుందవరం రాజు, చెవిటి బాలస్వామి, రవి శంకర్, చిన్నన్న పాల్గొన్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

**జమ్మలమడుగు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మైలవరం మండల పరిధిలోని కరమల వారిపల్లె గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని తెలుసుకొని ప్రతి కుటుం బానికి ఎంత మేరకు లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే డా.మూలే సుధీర్‌రెడ్డి అందజేశారు. అనంతరం స్థానిక ప్రజల నుంచి సమస్యలు తెలుసు కున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కన్యతీర్థంలో పౌర్ణమి ప్రత్యేక పూజలు

**జమ్మలమడుగు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు మండల పరిధిలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన కన్యతీర్థంలో గురువారం చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ శివనాథరెడ్డి ఆధ్వ ర్యంలో శ్రీబాల త్రిపుర సుందరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వమించారు. అర్చకులు హరిహర నాథశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగింపుగా ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**బద్వేలు రూరల్, ఏప్రిల్ 06 ప్రభాతవార్త :**



అగ్రికల్చర్ అడ్వైసరీ బోర్డు మీటింగ్ వ్యవసాయ అధికా రుల సమావేశం ఏడిఏ మర్రిపాటి నాగరాజ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఆకస్మికంగా ఏడిఏ నాగరాజ తనిఖీ లు చేపట్టి రైతే రాజు అనే రీతిలో ప్రతి రైతు భరోసా కేంద్రాలలో సంబంధిత రైతుల రిజిష్టర్లను పరిశీలించి సమస్యలపై రైతు భరోసా కేంద్రం సిబ్బందికి, పై అధికారు లకు సూచించాలని ఆదేశాలు జారీ చేసి నప్పటికీ ఇంత వర కూ ఆదేశాలను పాటించక పోవడం ఎంత వరకు సబబు అనే ఉద్దేశ్యంతో గ్రామ వ్యవసాయ సంచాలకులు ఉద్యాన సహాయకులకు సెక్రటరి కల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ నిర్వహించి ఏవైనా ఇబ్బందులు ఉన్నా రైతుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఎల్లవేళలా రైతుల పట్ల అంద రం కృషి చేయాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. కార్య కమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌ను కలిసి దేవగుడి నారాయణరెడ్డి

**జమ్మలమడుగు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



అనంతపురం జిల్లాలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారా యణరెడ్డి కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

## వై నాట్ 175 ఇది ఒక మైండ్ గేమ్

**కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



జగన్ గారూ మీరు ఏ వర్గం ప్రజ లకు ఏం చేశారని వై నాట్ 175 అంటు న్నారు. ఎస్సీలకు 17 పథకాలు ఎస్సీ సబ్ ప్లాన్ ఎత్తేసి ఎస్సీలపై దాడులు చేసి నందుకా, బీసీలకు స్థానిక సంస్థల రిజర్వే షన్ తగ్గించినందుకా, బీసీ కార్పోరేషన్ ఎత్తేసినందుకా అని టీడీపీ సిటీ ఉపా ధ్యక్షుడు ఎద్దేవా చేశారు. అన్ని రకాల ప్రజలను ఇబ్బందులు పెడుతున్న మీకు ఏ విధంగా 175 స్థానాలు వస్తాయంటున్నారని ప్రశ్నించారు. ప్రతి సంవ త్సరం జాబ్ క్యాలెండర్ అని చెప్పి యువతను మోసం చేశారని, రైతులకు గిట్టుబాటు దర కల్పిస్తామని ఆత్మహత్యలు తగ్గిస్తా నని అబద్దాలు చెప్పినందుకు వస్తాయా అన్నారు. పోలవరం పనులు మిగులు ఉన్న 28శాతం పనులు పూర్తి చేయనం దుకా ఏ విధంగా అంటున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జిలు జయశేఖర్, జనార్ధన్‌రెడ్డి, రాఘవ, శ్రీనివాసులు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ర్యాలీ

**కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



గత నాలుగు నెలలుగా రీజియన్ వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్క రించాలని డీపీటీవో కడప వారిని కోరు తున్నా పట్టించుకోవడం లేదని 2022 నవంబరు 29న మెమోరాండం ఇస్తే 3 నెలల పాటు కనీసం పిలిచి మాట్లాడింది లేదని నేజనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. మా సమస్యలు పరిష్కరిచకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వ హించాల్సి ఉంటుందని తెలిపి మౌనం వహించారు. గురువారం రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోలలో ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలియ జేశారు. తమ ప్రధాన సమస్యలైన వాటిని పరిష్కరించాలని అందులో భాగంగా సీనియారిటీ ప్రకారం డ్యూటీలు వేయాలని, అసోసియేషన్ నాయకులు సమస్యలు చెప్పేందుకు అవకాశం ఇవ్వ కుండా చేయడం సరికాదని, సంస్థ నియమ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, ఉద్యో గులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కల్యాణం

**కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**



కడప నగరం ఊటుకూరు పీఎస్‌నగర్ రామా లయంలో సీతారాముల కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం అమృతం, పాలాభి షేకం స్వామి వారి కల్యాణం ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అన్నదానం, సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పాలగిరి రాముడు మాట్లాడుతూ 1972 నుంచి గుడి నిర్మించుకొని పూజా కార్య క్రమాలు చేస్తున్నామన్నారు. కాంట్రాక్టర్ జేజే రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వ హించామన్నారు. కార్యక్రమంలో పాలగిరి మహేష్, దేవుడి రమేష్, వెంకట శివ, శ్రీనివాసులు, రాజా పాల్గొన్నారు.

## తాళ్లపాకలో పూజలు నిర్వహించిన హైకోర్టు న్యాయమూర్తి

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**



పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు ఆరాధించిన చెన్నకేశవ స్వామి, సిద్ధేశ్వరస్వామి ఆలయా ల్లో హైకోర్టు న్యాయమూర్తి బి.మురళీ కృష్ణ గురువారం పూజలు నిర్వహిం చారు. ఆలయాల్లో హైకోర్టు న్యాయ మూర్తికి పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయ మూర్తి ఆర్‌వివిఎస్ మురళీకృష్ణ, రాజంపేట సీనియర్ సివిల్‌జడ్జి ఎం.సంధ్యా రాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని ఆలయ పురోహితులు దుశ్శాలువతో సన్మానించారు.

## దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

**బద్వేలు రూరల్, ఏప్రిల్ 06 ప్రభాతవార్త**



కేంద్ర, రాష్ట్రాలలో దళజతులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి బిఎస్‌పి బద్వేలు నియోజకవర్గ అధ్యక్షులు అంబే ద్కర్ మిషన్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లా డుతూ 2014 నుండి కేంద్ర ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి 2019 లో రాష్ట్ర ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుండి వందలకు పైగా దళితులపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు ఆనవాయితీగా కొనసాగుతూనే ఉన్నాయని, పేర్కొన్నారు. దళితులపై జరుగుతున్న అత్యాచారా లను నిరసిస్తూ ఈ నెల 8వ తారీఖున ఛలో కడప కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బిఎస్‌పి, సీపీఎం, సీపీఐ, లోక్‌సత్తా, ఆమ్ ఆద్మీ, జనసేన, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, బీసీ సంఘా లతో పాటు జిల్లాలోని అన్ని సామాజిక సంఘాలు, ముస్లీం మైనారిటీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరుకానున్నట్లు వారు తెలిపారు. లౌకిక వాదులు, అభ్యుదయవాదులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి వెంకట రమణ, బిఎస్‌పి బద్వేలు నియోజకవర్గ అధ్యక్షులు గౌస్‌పీర్, డా॥ బి.ఆర్. అంబేద్కర్ మిషన్ నాయకులు రాముడు, రామకృష్ణలు పిలుపునిచ్చారు.

SRI SAI RAJESWARI B.Ed COLLEGE
(Approved by SRC,NCTE BANGALORE &
Affiliated to YogiVemana University Kadapa)
Lingapuram (Vi&P), PRODDATUR (M), Y.S.R. Kadapa (Dist) A.P.

B.Ed. Management Quota / Spot Admissions seats are available for the year 2022-2024

Applications are invited for Admission into B.Ed Course 1.Mathe matics 2. Physical science 3. Biological science 4. Social Science 5. English for the year 2022-2024 Eligibility : Degree pass with 50 % for O.C. and above 40 % for BC/SC/ ST/PH in degree level Last date : Submission of application on 10-04-2023 in working hours 10:00 AM to 05:00 PM.

CONTACT : 9908049828, 8247833099, 9030100004

**డాక్యుమెంట్ పోయినవి**

పొదదుర్తి షేక్ మహబూబ్‌బాష **S/o** కరీంసాబ్ డోర్.నెం. **1/94**, చిన్నచెప్పలి (గ్రా), కమలాపురం కడప జిల్లా. **28.03.2023**వ తేదీన ఉదయం **9.40**గంటలకు నేను, నా కుమారుడు మోటారు సైకిల్‌పైన ఆర్‌టిపిపి నుండి కమలాపురానికి వస్తుండగా పోయినది ల్యాండ్ డాక్యుమెంట్ నెం. **2569/2004 Dt. 7-10-2004**, ఎస్ఆర్. కమలాపురం. దొరికిన వారు సెల్ : **9666967205** నెంబరుకు తెలియజేయగలరు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహణ



కడప, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : కడప నగర శివారులోని స్థానిక కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ని కళాశాల హెల్త్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నేడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీమతి డాక్టర్ సాయి కిరణ్ న్యూరో సర్జన్, ఆర్య న్యూరో కేర్ కడప వారు ముఖ్య అతిథిగా విచ్చేసి వారు మాట్లాడుతూ "హెల్త్ ఫర్ ఆల్" అనే అంశం ప్రపంచ ఆరోగ్య సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం అని, మానవుని దైనందిన జీవితకాలంలో అనారోగ్యానికి గల కారణం మనం తీసుకునే ఆహారపు అలవాట్లపైనే జీవిత ఆయుష్షు ముడిపడిందని ప్రతిరోజు శరీరానికి కావలసిన శారీరక శ్రమ,యోగా వంటి కాలకృత్యాలు అలవర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అనారోగ్యం బారిన పడినప్పుడు చేయవలసిన పద్ధతులు, జాగ్రత్తలు గురించి విపులంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, ఈసీఈ విభాగాధిపతులు డాక్టర్ జి. హేమలత హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతులు డాక్టర్ ఐ. శ్రీ వాణి, ప్రోగ్రాం సమన్వయకర్త ఆనంద్ రావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కెఎస్ఆర్ఎం కళాశాల అధ్యాపకునికి పీహెచ్‌డి ప్రధానం



కడప, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : కడప నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న ఏ. చంద్ర ఓబుల్ రెడ్డికి జవహర్లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయం (అనంతపురం) వారు పీహెచ్‌డీ డిగ్రీని ప్రధానం చేశారని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ విఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ లో జవహర్లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ విశ్వవిద్యాలయం (అనంతపురం) లో సహా ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ కె. మాధవి గారి పర్యవేక్షణలో Applying Deep learning techniques for answering complex questions అనే అంశంపై పరిశోధన చేయ డం వలన జేఎన్‌టి విశ్వవిద్యాలయం పీ హెచ్ డీ పట్టాను ప్రధానం చేశారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పలు సెమినార్స్, వర్క్ షాప్స్, కాన్ఫరెన్స్, లలో పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ పి హెచ్ డీ డిగ్రీ పట్టాను పొం దడం పట్ల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) గారు ప్రధాన ఆచార్యులు డాక్టర్ విఎస్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.లోకేశ్వర్ రెడ్డి, వివిధ శాఖధిపతులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పీహెచ్ డి పొందిన వారిని అభినందించారు.

## రాజ్యాంగ రక్షణ బేరికి తరలిరండి

### వీసీకే పార్టీ నాయకులు పిలుపు



మదనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : పట్టణంలో ఈనెల 8న బిటి కళాశాల మైదానంలో జరిగే రాజ్యాంగ రక్షణ బేరి కార్యక్రమానికి తరలిరావాలని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం బాస్ కార్యాలయంలో వీసీకే పార్టీ నాయ కులతో కలసి ఆయన రాజ్యాంగ రక్షణ రణబేరీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో తొలిసారిగా నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. 8ఏళ్ళ బిజెపి పాలనలో దేశం తిరుగమణం వైపు పయనిస్తోందన్నారు. రాజ్యాంగ మూలసూత్రాలను తుంగలో తొక్కి మోడీ ప్రభుత్వం అంబానీ, ఆదానీలకు దేశసంపద దోచిపెడుతోందని విమ ర్శించారు. ప్రజలందరికి సమాన అవకాశాలను, సమాన గౌరవాన్ని మానవ హక్కులను ప్రసాదించిన భారత రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేసే బిజెపి కుటిల యత్నం చేస్తోందన్నారు. 2024ఎన్నికల్లో బిజెపికి చమరగీతం పాడాల న్నారు. ఈ మహాసభకు జాతీయ అధ్యక్షులు డాక్టర్ తిరుమావళవన్ ప్రజాయుద్ధ నౌక గద్దర్, కర్నాటక మాజీ స్పీకర్ రమేష్‌కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ క్రిష్ణ, సిపిఎం రాష్ట్రకార్యదర్శి శ్రీనివాసరావులు తరలి వస్తారన్నారు.

## చేనేతలను విస్మరించిన ప్రభుత్వానికి బుద్ది చెప్పాలి

### మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : చేనేతలను అన్ని విధాల విస్మరించిన వైకాపా ప్రభుత్వానికి బుద్ది చెప్పాలని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం ఆయన నీరుగట్టువారి పల్లెలో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలకు రావాల్సిన రాయతీలను రద్దు చేసి వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సిల్క్‌ధర పెరగడం వల్ల పట్టుచీరలకు డిమాండ్ లేక చేనేతలు అన్ని విధాల నష్టపోతున్నారన్నారు. చేనేతలు తయారు చేసే పట్టుచీరలకు డిమాండ్ కల్పించి వారిని అన్ని విధాల ఆదుకోవాలన్నారు. సబ్సిడీ రాయితీలను వెంటనే మంజూరు చేయాలన్నార. చేనేతలను విస్మరించిన ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అధికారం చేపడుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు మోడెం సిద్దప్ప, మాజీ కౌన్సిలర్లు నీలకంఠ, బండి నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బహుజనలారా ఏకం కండి

### ఆర్జీఎస్ జిల్లా అధ్యక్షులు రెడ్డిశేఖర్



మదనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : బహుజనులారా ఏకం కంటి అంటూ రాష్ట్ర గిరిజన సమాఖ్య(ఆర్జీఎస్) జిల్లా అధ్యక్షులు కిల్లా రెడ్డిశేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లెలో 8న జరిగే రాజ్యాంగ రక్షణ బేరీ మహాసభను విజయ వంతం చేయాలన్నారు. రాజ్యాంగ బహుజనులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ లకు కల్పించి హక్కులు రాజ్యాంగ బద్దంగా జరగాలని తెలియజేశారు. అన్న మయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్జీఎస్ నాయకులు, గిరిజనులు, ప్రగతిశీల సభ్యులు, మేధా వులు వచ్చి మహాసభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గాలేటి నరేంద్ర, గిరిజన నాయకులు జి.గంగాధర్, గాలేటి అశోక్, వీరాంజనేయులు, శేషాద్రి, క్రాంతికుమార్, ఆంజినేయులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి

### నిత్యం పూజలందుకొంటున్న అక్కదేవతలు



నిమ్మనపల్లె, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : మదనపల్లె-నిమ్మనపల్లె మార్గాన వెలసిన అక్కదేవతలు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దేవతలుగా నిత్యం పూజలు అందుకుంటున్నారు. మదన పల్లె-నిమ్మనపల్లె మార్గంలో అక్కగార్ల కుంట కలదు. అక్కడ అక్కదేవతలు వెలిశారు. ఈ అక్కదేవతలు పక్కనే ఆభయ ఆంజనేయస్వామి కొలువు తీరాడు. దీంతో మదనపల్లె పట్టణ వాసులతో పాటు నిమ్మనపల్లె మండల వాసులు కూడా భక్తులు తరలి వచ్చి పూజలుచేస్తుంటారు. ఈ ఆలయ ఆవరణంలో 15 అడుగుల ఎత్తైన నాగదేవల పుట్ట, పంచముఖ ఆంజనేయుడు, నవగ్రహాలు, నాగదేవతలు, సీతారామ, లక్షణుల విగ్రహాలు, కళకళలాడే కొనేరు అందులో తామరపువ్వులు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుంటాయి. ఇంకా దేవ గన్నేరు చెట్టు, బలపత్రాకులచెట్లు, కలదు. తడి బట్టలతో ప్రతి సోమవారం, శుక్రవారం పూజలు చేస్తే అక్కదేవతలు కోరిన కొర్కెలు భక్తులకు అనుగ్రహిస్తారని మహిళలు వరపడుతుంటారు. అతి పురాతనమైన ఆలయం కావడంతో ఇక్కడికి భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడం విశేషం. ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన మామిడి తోటలో అక్కగార్లు ఆలయం కలదు. ముఖ్యంగా సోమ, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు జరుపుతారు.

## ఫ్యామిలీ డాక్టర్ గ్రామీణులకు వరం

ములకల చెరువు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మారుమూల ప్రాంతాల్లోని రోగులకు ఓ వరమని డాక్టర్ అహ్మద్ బాషా, సర్పంచ్ శంకర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని కదిరనాథునికోటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వారు లాంచనంగా ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలు పెరిగితే మీ ఇంటికి డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది మరియు వైద్య పరీక్షలు సైతం ఇక్కడే నిర్వహించే సౌకర్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఎక్కడైనా సరే సమస్య ఏర్ప డితే యుద్ధ ప్రాతిపదికన 104 వాహనం ద్వారా సకాలంలో వైద్య సేవలు అందించే వెసులుబాటు ఉంటుందన్నారు. మీ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని వైద్య కేంద్రాలకు నిత్యం అందు బాటులో ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క మారుమూల గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో బీవీ రమణ, ఏఎన్ఎం రెడ్డమ్మ పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్లకు మెడికల్ క్యాంప్, న్యాయవిజ్ఞాన సదస్సు

కడప లీగల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్.కవిత నగర శివార్లలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో మెడికల్ క్యాంప్ మరియు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు. అందరికీ ఆరోగ్యం నినాదంతో 68వ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు టోల్ ఫ్రీ నెంబరు 14567పై అవగాహన కల్పించారు. నల్సా (లీగల్ సర్వీసెస్ సీనియర్ సిటిజన్) పథకం 2016 గురించి వివరించారు. సీనియర్ సిటిజన్స్‌కు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వారికి షుగర్, బీపీ, మరియు ఇతర వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా ఐరన్, క్యాల్షియం, ఓఆర్ఎస్ తదితర మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్ఫూర్తి, వైద్యసిబ్బంది, ఓల్డేజ్‌హోం నిర్వాహకులు మరియు సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటీలో ఆన్‌లైన్ వర్క్‌షాప్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ (ఆర్‌జీఎన్ ఐపీఎం) వారి సహకారంతో డా.ఎన్. భరత్ సూర్యవంశీతో ఆన్‌లైన్ వర్క్సాప్ నిర్వహించడం జరిగింది. తమ కళాశాలలో బీటెక్ విద్యా ర్థులు ఇందులో పాలు పంచుకున్నారని ఇందుకుగాను ఈ సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగు తుందని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వరరెడ్డి, డీన్ ఆర్అండ్‌డీ సెల్ డా.సుఖేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక

కడప కార్పొరేషన్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



ఆర్టీసీ కార్పొరేషన్ ఛైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డిని ఏపీ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మచ్చయ్య గారి నాగ మల్లేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా నాగమల్లేష్ మాట్లాడుతూ బీసీ సమస్యల పరిష్కారం కోసం పాటుపడతానని పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం పోరాడతానని కూడా చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆలంఖాన్‌పల్లెలో శ్రీశ్రీశ్రీ మారెమ్మ జాతర

### – 9న వృషభరాజములచే బండలాగుడు పోటీలు

కడప కార్పొరేషన్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:

నగర 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో వెలసిన శ్రీశ్రీశ్రీ మారెమ్మ తల్లి ఆలయ 19వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఈనెల 8, 9 తేదీల్లో జాతచ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ మేరకు శనివారం ఉదయం అమ్మవారికి గణపతి పూజ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారికి గ్రామోత్సవ కార్యక్రమం, 9వ తేదీ ఉదయం అమ్మవారికి నినండుకుండ బోనాలు, మొక్కుబడులుంటాయని తెలిపారు.

**9న వృషభరాజములతో బండలాగుడు పోటీలు**

జాతర నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి (న్యూ కేటగిరి) వృషభాలకు బండలాగుడు పోటీలు జరుగుతాయని ఇందులో విజయం సాధించిన మొదటి విజేతకు రూ.60వేలు (జీఎల్ఆర్‌సన్స్ మన్‌మోహన్‌రెడ్డి- రఘునాథంరెడ్డి) 2వ బహుమతి రూ.40వేలు (ఎల్.మునికుమార్‌ంరెడ్డి), 3వ బహుమతి రూ.30వేలు( రాఘవరెడ్డి బ్రదర్స్), 4వ బహుమతి రూ.20వేలు (రెడ్డిచర్ల బ్రదర్స్), జయరామిరెడ్డి, వెంకటరామింరెడ్డి, 5వ విజేతకు రూ.10 వేలు (జి.నారాయణరెడ్డి), 6వ విజేతలకు రూ.5వేలు ఎస్.నరసింహారెడ్డి) బహుమతులు అందజేయనున్నారు.

## గ్రామీణులకు అందుబాటులో ఫ్యామిలీ డాక్టర్

### – మెడికల్ ఆఫీసర్ మునికుమార్



తంబళ్లపల్లె, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మారుమూల ప్రాంతాల్లోని రోగులకు ఓ వరమని మెడికల్ ఆఫీసర్ మునికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని గుండ్లపల్లి పంచాయతీ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన లాంచనంగా ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలు పెరిగితే మీ ఇంటికి డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది మరియు వైద్య పరీక్షలు సైతం ఇక్కడే నిర్వహించే సౌకర్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో ఎక్కడైనా సరే సమస్య ఏర్పడితే యుద్ధ ప్రాతిపదికన 104 వాహనం ద్వారా సకాలంలో వైద్య సేవలు అందించే వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ జనార్ధన, ఏఎన్ఎం హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, ఎంపీహెచ్‌ఏ కృష్ణ నాయక్, ఆశా కార్యకర్త భారతి, అంగన్‌వాడీ వర్కర్ మైథిలి, వార్డు వమెంబర్ ఆదినారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

## బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మైదుకూరు ఏప్రిల్ 6, ప్రభాతవార్త



మైదుకూరు పట్టణ పరిధి లోని బిజెపి పార్టీ కార్యాలయంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గం కన్వీనర్ మాచనూరు సుబ్బారాయుడు జెండా ఎగర వేయడం జరిగింది. అనంతరం సుబ్బారాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను తీసు కొస్తుందని కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని బిజెపిలో సభ్యత్వం పొంది పార్టీ బలోపేతం కోసం పార్టీ నాయకులు కృషి చేయవలసిన అవసరం ఎంతో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ దేశం కోసం చేస్తున్న సేవలు చిరస్థాయిలో మైలురాయిగా నిలబడిపోతాయని కొనియా డారు కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఆర్ రామకృష్ణ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు జి రాజ మోహన్ రెడ్డి మాజీ అసెంబ్లీ కన్వీనర్ అన్నపురెడ్డి శేఖర్ రెడ్డి , పార్టీ కార్యకర్త శ్రీనివాస్, పాల్గొనడం జరిగింది.

## పౌర్ణమి సందర్భంగా అన్నదానం

ప్రొద్దుటూరు ఏప్రిల్ 6, ప్రభాతవార్త



పట్టణంలోని అమ్మ నాన్న మదర్ తెరిసా షబ్బీర్ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి పౌర్ణమికి అన్నదాన కార్యక్రమాలలో భాగంగా గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని 22వ వార్డు వైసిపి ఇంచార్జి ఎర్రబల్లె హిదాయత్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు హిదాయత్, కార్యదర్శి ఫక్రుద్దీన్, 23వ వార్డు కౌన్సిలర్ వడ్ల ఖలీలుల్లా, కరీముల్లా, వేంపల్లి గౌస్, నూరి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## నేటి నుంచి దుంపలగట్టు అంకాలమ్మ తిరుణాల

ఖాజీపేట ఏప్రిల్ 6, ప్రభాతవార్త



కడప జిల్లా ఖాజీపేట మండలం దుంపలగట్టు గ్రామంలో పేరు గాంచిన దుంపలగట్టు అంకాలమ్మ తిరుణాల నేటి నుండి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది తిరుణాల మూడు రోజులు పాటు ఘనంగా నిర్వహిస్తారు. "6వ తేదీ బియ్యం కొలతతో ప్రారంభమై 9వ తేదీ బోనాలతో ముగియనున్న అంకాలమ్మ తిరుణాల" దుంపలగట్టు అంకాలమ్మ గుడి దగ్గరకు వచ్చి దైవ దర్శనం చేసుకున్న అనంతరం అంకాలమ్మ తిరుణాలలో భక్తులకు త్రాగునీటి విషయంలో గానీ, పరిశుభ్రత విష యంలో గానీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రమణారెడ్డి తెలిపారు.

## కోదండరాముని దయతోనే అన్నదానం : విజయశేఖర్‌రెడ్డి

ఒంటిమిట్ట ఏప్రిల్6 ప్రబాతవార :



ఒంటిమిట్ట కోదండరాముని దయతోనే కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు రాజంపేట యువనాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి (పెద్దబాబు) తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం వెనుక బాగంలో ఆయన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కోదండరాముని దయతో శ్రీరామ నవమి రోజు, కల్యాణం రోజు, రథోత్సవం రోజున భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణి చేశామన్నారు. కల్యాణ రోజున సుమారు 20వేల మందికి పైగా అన్న ప్రసాదాలు తిన్నరన్నరు. కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో బాగంగా అన్నదానం చేయడం చాల సంతోషంగా వుందన్నారు. కార్యక్రమంలో పలువురు కోదండ రాముని భక్తులు పాల్గొన్నారు.

## దేశానికి దశ దిశ బిజెపినే : శంకరమూర్తి



బి.కొత్తకోట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: దేశానికి దశా దిశా ఆర్య భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని బి.కొత్తకోట బీజేపీ మండల అధ్యక్షుడు శంకరమూర్తి తెలిపారు. గురువారం భారతీయ జనతా పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కాలనీలో ఆయన పార్టీ పతాకా విష్కరణ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మంగ రాజు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర మాట్లాడుతూ 1951లో జన సంఘ పార్టీకి మొదటి అధ్యక్షు డిగా శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశంలో ఎమర్జెన్సీ తరు వాత జనతా పార్టీ అధికా రంలోకి వచ్చి ప్రధానమంత్రిగా మొరార్జీ దేశాయ్ 1996 లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా, 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా నేటికీ కొనసాగుతుండడం విశేషమన్నారు. దేశం సస్యశ్యామలంగా ఉండాలంటే తిరిగి బీజేపీ అధికారం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోరంట్ల రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి, కిసాన్ మోర్చా నాయ కుడు మనోహర్ గౌడ్, రంగారెడ్డి, మురళీ, మోహన్, గోపి పాల్గొన్నారు.

## పక్కా గృహాల లక్ష్యాలను పూర్తి చేయాలి

### – ఈవోపీఆర్డీ పులిరాంసింగ్



సిద్దవటం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: సచివాలయ సిబ్బందికి కేటాయించిన పక్కా గృహాల లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ పులిరాంసింగ్ సూచించారు. మండల కేంద్రమైన సిద్ద వటం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం పక్కా గృహాలపై సచివాలయ సిబ్బందితో ఈవోపీఆర్డీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం సచివాలయం పరిధిలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు పక్కా గృహాలు త్వరితగతిన నిర్మించుకునేందుకు అన్ని రకాల సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. సచివాలయ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. గృహాలకు సంబంధించిన బిల్లులు కూడా మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జంగాలపల్లి పంచాయతీ కార్యదర్శి సుప్రజ, డిజిటల్ అసిస్టెంట్ మృణాలిని, వెల్ఫేర్‌అసిస్టెర్ డేవిడ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## బీజేపీ హటావో భారత్ బచావో పాదయాత్రను జయప్రదం చేయండి

ములకల చెరువు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



సామాన్యులపై అధిక భారం మోపిన ప్రభుత్వాన్ని సాగనంపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యవర్గ సమావేశం నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్రంలోని ప్రభుత్వాన్ని నిరసిస్తూ ఈనెల 14 నఉుంచి 30 వరకు నిర్వహించే ప్రచార పాదయాత్రలో జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రధాన మంత్రి మోదీ ఆదాని, అంబానీలకు ఊడి గం చేస్తూ సామాన్యులపై అధిక భారం మోపడం అన్యాయమన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా బీజేపీ హటావో – భారత్ బచావో అన్న నినాదంతో పాదయాత్ర కార్యక్రమాలు జరుగు తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అంజనప్ప, ఆనంద్, తంబయ్యశెట్టి పాల్గొన్నారు.

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ములకల చెరువు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



ములకల చెరువు మండలంలోని వేపూరి కోటలో గురువారం భారతీయ జనతాపార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షుడు పీవీ జయరాంరెడ్డి అధ్యక్షతన పతాకావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కోఆపరేటీవ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ప్రజలందరికీ నమ్మకమైన పాలన సాగిస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడుఇపిస్తూ ప్రపంచంలోనే భారతదేశాన్ని ఉన్నత స్థానంలోకి తీసుకెళ్లాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజలు ఆనందంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మంగరాజు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫరీద్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శోభారాణి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు సుధాకర్, మండల ప్రధాన కార్య దర్శి భయ్యారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మునీంద్ర, శంకర్‌రెడ్డి, మద్దిరెడ్డి పాల్గొన్నారు.

## తైక్వాండో పోటీల్లో యువకుల తడాఖా

### అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త



స్థానిక శ్రీ కృష్ణ గీతా శ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు తైక్వాండో పోటీల్లో తమ తడాఖాను ప్రదర్శిస్తున్నారు. జాతీయ, అంతర్జా తీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పురస్కార పంట పండిస్తున్నారు. తాజాగా ఇటీవల మలేషియాలో జరి గిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తలబడ్డారు. ఇందులో కళాశాలకు చెందిన విద్యార్థులు రుద్రసేనారెడ్డి, బెన్నూర వరప్రసాద్, యగ్నేష్ లు రెండు బంగారం పతకాలు, ఒక వెండి, మూడు బ్రౌంజ్ పతకాలు సొం తం చేసుకున్నారు. ఉత్తమ ప్రతిభ కన బరిచిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ, కోఆర్డినేటర్ గౌరీ శంకర్, తైక్వాండో శిక్షకుడు శ్రీనివాసులు అభినందించారు.

## శ్రీచక్ర యాజమాన్యం, విద్యార్థులచే జాయ్ ఆఫ్ లింగ్

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త



శ్రీ చక్ర యజమాన్యం వారు విద్యార్థులచే జాయ్ ఆఫ్ గివింగ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించి గురువారం పాఠశాల విద్యార్థులతో కలిసి విశ్వ ప్రేమ వృద్ధాశ్రమాన్ని సందర్శించి, పిల్లల చేతుల మీదుగా వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. వారికి కావలసిన నిత్యావసర సరుకులను పండ్లను, ?21,930 ఆర్థిక సహాయాన్ని అందించారు. దీని ద్వారా పిల్లలు పెద్దవారితో ఎలా నడుచుకోవాలో, ఎలా నడుచుకో కూడదనే అంశాలను ఉపాధ్యాయుల ద్వారా, ఆయా పరిసరాల ద్వారా పిల్లలకు తెలియజేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ప్రశాంతి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ సీపీఆర్ అవగాహన అవసరం : జెవివి

ప్రొద్దుటూరుఅర్బన్ ఏప్రిల్ 6, ప్రభాతవార్త



ప్రజలందరికి సీపీఆర్ పైన అవగాహన అవసరం అని జన విజ్ఞాన వేదిక ఆరోగ్య విభాగం కన్వీ నర్ డాక్టర్ కాల్వ విజయ నాగేంద్ర అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్స వం సందర్భంగా ఈరోజు స్థానిక మైదుకూరు రోడ్డు లోని "రాణి తిరు మలదేవి డిగ్రీ కళాశాల "యందు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో "మనిషి స్పృహ కోల్పోయినపుడు ఏమి చేయాలి?" అనే అంశం పై సదస్సును ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అధ్యక్షతన వహించారు. సమావేశంలో డాక్టర్ విజయనాగేంద్ర మాట్లాడుతూ ఆకస్మాత్తుగా కాని, ప్రమాదవశాత్తు కాని మనిషి ఉన్నట్టుండి స్పృహ కోల్పో యినపుడు మనం ఆ మనిషికి "సీపీ ఆర్ "ని ప్రథమ చికిత్సగా చేయడం ద్వారా ఆ వ్యక్తిని కాపాడవచ్చు అని అన్నారు. శ్వాస ఆడకపోతే కృత్రిమంగా నోటి ద్వారా అందించాలి అని అన్నారు. ఈ ప్రక్రియను అంబులెన్స్, డాక్టర్ ని సంప్రదించే లోపు చేయడం వల్ల తగు ఫలితం ఉంటుందని అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ "అందరికి ఆరోగ్యం " అనే నినాదపు లక్ష్యం నెరవేరాలంటే ప్రాథమిక ఆరోగ్యం పైన దృష్టి సారించాలని, ప్రజల్లో అవగాహ నను ఆరోగ్యం పైన పెంచాలని అన్నారు. సీపీఆర్ పైన అందరికి అవగాహన ఉండటం కీలకం అని అన్నారు. సదస్సు అనంతరం విద్యార్థులకు సీపీఆర్ పైన డెమో ప్రాక్టికల్ నాలెడ్జ్‌ని ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యులు తరునేందు శేఖర్, జెవివి జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్, జిల్లా ఉపాధ్యక్షుడు పోలంకి శ్రీరాములు, జిల్లా నాయకులు మురళీగుప్త,శర్వాణి, అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

ఖాజీపేట ఏప్రిల్ 6, ప్రభాతవార్త



బిజెపి 43వ ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా కడప జిల్లా మైదుకురు నియోజకవర్గం ఖాజీపేట మండలం బస్టాండ్ కూడలి నందు కడప జిల్లా బిజెపి కార్యదర్శి ఎన్ లక్ష్మీదేవి ఆధ్వ ర్యంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లా డుతూ కోవిడ్ నుంచి దేశ ప్రజలను కాపా డేందుకు 220కోట్ల డోసులను ఉచితంగా అందించిన ఘనత నరేంద్ర మోడీ గారిదేనని దేశంలో వన్ నేషన్ వన్ రేషన్ విధానంతో దేశంలోని ప్రజలందరికీ డిసెంబర్ వరకు ప్రతి ఒక్కరికి 5 కిలోలు బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. దశాబ్దాలుగా దేశ ప్రజలు ఎదురుచూస్తున్న రామజన్మభూమి అయోధ్యలో రామమందిరం భవన నిర్మాణ పనులు మన ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో జరగడం విశేష మన్నారు కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్య వర్గ సభ్యుడు శ్రీ హరిభాస్కర్ రెడ్డి, బిజెపి మండలాధ్యక్షుడు అజయ్ కుమార్, బిజెపి ప్రధాన కార్యదర్శి నరహరి, బిజెపి కమిటీ మెంబర్ సిద్దయ్య, హేమారెడ్డి పాల్గొన్నారు

## కుట్టుమిషన్లు పంపిణీ

ప్రొద్దుటూరు ఏప్రిల్ 6, ప్రభాతవార్త



జననీ సేవా సంస్థ సహకారంతో వికసితా ఫౌండేషన్, నెహ్రూ యువ కేంద్రం ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న సరస్వతి, శిరీష అనే ఇరువురు మహిళలకు రెండు కుట్టుమిషన్లను డాక్టర్ నాగార్జున చేతుల మీదుగా గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుట్టు మిషను తీసుకున్న లబ్దిదారులు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ ఆర్థికంగ అభివృద్ధి సాధించాలని కోరారు. కుట్టు మిషన్ల ఇచ్చేందుకు సహకరించిన జననీ సేవా సంస్థ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, దేవిక మున్ని, సురేఖ, లోక సంస్థ హ్యూమన్ రైట్స్ స్టేట్ ఉపాధ్యక్షుడు పామిడి వీరయ్యయాదవ్ పాల్గొన్నారు.

## చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం

ప్రొద్దుటూరు ఏప్రిల్ 6, ప్రభాతవార్త




ప్రొద్దుటూరు పట్టణంలో కొన్ని మాసాలుగా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకృష్ణ దేవాలయ యాదవ సేవా సమితి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం కొనసాగుతోంది అందులో భాగంగానే గురువారం స్థానిక లోని పెద్దమ్మ చిన్నమ్మ తల్లి దేవాలయం దగ్గర స్థానిక నిర్వహించిన అన్నప్రసాద కార్య క్రమాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు శక్తి ఉన్నంత మేరకు అన్న కార్యక్రమాల్ని కొనసాగిస్తానని తెలిపారు తన తండ్రి ఆశలకు అనుగుణంగా ప్రతి నెలలో ఐదు రోజులు అన్నదాన కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు ప్రతి శనివారము మరియు పౌర్ణమి రోజున ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు పట్టణంలోని ప్రయాణికులు నిరాశ్రయులు పాదచారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ సం తృప్తిని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్ బలప నూరు శ్రీనివాసులు మూరబోయిన శ్రీనివాస్ యాదవ్ నాగప్రసాద్ చింతల రాఘవేంద్ర యాదవ్ సీతంపల్లి రమణ మంది శివప్రసాద్ నల్లం శంకర్ కొండూరు వెంకటసుబ్బయ్య హరీష్ ఉయ్యాల మధుసూదన్ రెడ్డి ఆరేటి పల్లె హేమంత్ ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం

పుల్లంపేట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



పుల్లంపేట మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురువారం సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని తోట ఇంటివారినుంచి తీసుకురాగా స్వామివారిని పెంద్యాల కుటుంబం నుంచి సాయి బాబా ఆలయానికి తీసుకురావడం జరిగింది. ఆలయంలో పౌరోహితుడు చోరగుడి మహేష్ ఆధ్వర్యంలో కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెంద్యాల వెంకట నరసయ్య, ఆయన సోదరుడు శ్రీహరి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కళ్యాణంలో ఎస్బివిడిసభ కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయులు సామా సుబ్బరాయుడు, తెలుగు పండితులు మలవతు సుబ్బరాయుడు, బికె మణి, ఇంకా పలువురు గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లకు పాన్పు సేవతో ముగించారు.

## ఎమ్మెల్యే గడికోట దృష్టికి వండాడి గ్రామ సమస్యలు

చిన్నమండెం, ఏప్రిల్ 6ప్రభాతవార్త:



వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో భాగంగా చిన్నమండెంకు విచ్చేసిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వైసిపి సీనియర్ నాయకులు రంగారెడ్డి విజ్ఞప్తి మేరకు వండాడి గ్రామ సచివాలయం సందర్శించారు. గ్రామంలో తూర్పుపల్లె హరిజనవాడలోని ఇంటి పట్టాలు, ఇళ్లు ఆన్‌లైన్ చేయాల్సిందిగా చేసిన విజ్ఞప్తి మేరకు తహశీల్దార్‌తో మాట్లాడి సమస్య పరిష్కారం చేయాల్సిందిగా ఆదేశించారు. సుగాలిల నూతన కాలనీలో కొందరికి ఇళ్లు రాలేదని ఫిర్యాదు చేయగా సమస్య పరిష్కంచాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్పంచ్ చింతం ముసల్‌రెడ్డి చొరవతో తమ పరిష్కారం అవుతున్నందుకు హరిజనవాడ ప్రజలు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి, మాజీ జడ్పీ వైస్ ఛైర్మెన్ దేవనాథ్‌రెడ్డికి, సర్పంచ్ ముసల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ ఛైర్మెన్ దేవనాథ్‌రెడ్డి, సర్పంచ్ ముసల్‌రెడ్డి, మాజీ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ మల్లూరు రెడ్డివరప్రసాద్, ధనుంజయ్‌రెడ్డి, గఫార్, రాము,

## సమీక్ష సమావేశానికి తరలివెళ్లిన టీడీపీ నాయకులు

సంబేపల్లె, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



తెదేపా అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నెల్లూరులో నేడు నిర్వహించనున్న జోన్-4 సమీక్ష సమావేశానికి మండల టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఈ మేరకు గురువారం టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గపు టీడీపీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు తమందరం సమీక్ష సమావేశానికి వెళ్తున్నట్లు తెలిపారు. సమీక్ష సమావేశంలో పాల్గొని తమ అధినేత చంద్రబాబునాయుడు సూచనలను పాటించి టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. సమీక్ష సమావేశానికి తరలివెళ్లిన వారిలో మాజీ జడ్పీటీసీ మల్లు నర్సారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు బయ్యారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, సుబ్బరాజు యాదవ్, పలువురు యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు తరలివెళ్లారు.

## వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన సిఎం

చిన్నమండెం, ఏప్రిల్ 6ప్రభాతవార్త:



వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు సిఎం జగన్ తెచ్చారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నమండెం మండలంలోని నాడు-నేడు కింద చిన్నమండెం పిహెచ్‌సిలో రూ.39.30 లక్షలతో పూర్తయిన మౌలిక వసతులు, అభివృద్ధి పనుల ప్రారంభంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మెన్ దేవనాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. చిన్నమండెం, టి. చాకిబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుతున్న వైద్య సేవలుపై ఆయన ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని విజయవంతం చేయాలని శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు కోరారు.

## వైభవంగా రాములోరి కళ్యాణం

రామాపురం, ఏప్రిల్ 6ప్రభాతవార్త:



శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామ కస్పాలోని రాముల గుడిలో గురువారం కెపిఆర్ కన్స్‌ట్రక్షన్ అధినేత కనపర్తి పెంచల్ రెడ్డి, కనపర్తి చెన్నారెడ్డిల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకున్నారు. కళ్యాణంలో స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించి వేదమంత్రాలతో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. తదనంతరం వచ్చిన భక్తులకు స్వామివారి ప్రసాదంగా పానకం, వడపడప్పును సమర్పించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

దువ్వూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని మైదుకూరు శాసనసభ్యుడు ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు సిమెంటు రోడ్లు వేయాలని కోరగా వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి సంక్షేమ పథకాలు అందించడం వల్ల పేదరిక నిర్మూలన జరుగుతుందన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న చేదోడు, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత ద్వారా ప్రజలకు ఒక్క పైసా ఖర్చు లేకుండా వారి ఖాతాల్లోకే నగదు జమ అవుతోందన్నారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల తిరిగి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, మండల వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## రైతుల ఆనందం కోసమే ఎద్దుల బండలాగుడు పోటీలు

### - మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, ఏప్రిల్ 6ప్రభాతవార్త:



పురాతన కాలం నుంచి పండగలు, జాతర్ల సందర్భంగా ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించడం ద్వారా రైతుల్లో ఆనందం, ప్రజల్లో ఐకమత్యం ఏర్పడుతుందని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువనాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటి మండలం బట్ల చెరువు పంచాయతీ కాటిమాయకుంటలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి 29వ వార్షికోత్సవం సందర్భంగా హాజరై శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజల కోలాహలం మధ్య రసవత్తరంగా ఎద్దుల బండలాగుడు పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పురాతన కాలం నుంచి గ్రామ సీమల్లో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించడం ప్రజలందరూ తిలకించడం ఈ పోటీలకు కొన్నిచోట్ల రైతులు చందాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను కనుమరుగు కాకుండా బొట్ల చెరువుపంచాయతీ కాటిమాయకుంట ప్రజలు ఐక్యమత్యంగా నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజ.ల్లో ఈర్షా ద్వేషాలు లేకుండా ఐకమత్యంగా ఉంటారని రాంప్రసాద్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యుడు కొండా భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, కిరణ్‌బాలు, కొండారెడ్డి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## 10వ తరగతి జవాబు పత్రాలు లీకేజీలో ఏడుగురు అరెస్ట్

### - డిఎస్పీ వంశీధర్ గౌడ్

బ్రహ్మంగారి మఠం, ఏప్రిల్ 06 ప్రభాతవార్త :



ఈ నెల 23వ తేదీన బి.కోడూరు జడ్పీ హై స్కూల్ నందు 10వ తరగతి తెలుగు జవాబు పత్రం లీకేజీ విషయంలో 7 మందిపై కేసు నమోదు చేసి వారిని ఉదయం బి.మఠం మండలం చెంచయ్యగారిపల్లె క్రాస్ రోడ్ వద్ద అరెస్ట్ చేసినట్లు మైదుకూరు డిఎస్పీ వంశీధర్ గౌడ్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23వ తేదీన జరిగిన తెలుగు పరీక్ష జవాబు పత్రం బి.కోడూరు జడ్పీ హై స్కూల్ నుండి సగిలేరు గురుకుల పాఠశాలలో పార్ట్ టైం ఉద్యోగిగా పని చేస్తున్న బాలుడు అనే వ్యక్తి వారి విద్యార్థి ద్వారా ప్రశ్నా పత్రం బయటికి తెప్పించుకొని దానిని మైక్రో జిరాక్స్ ద్వారా బ్రహ్మంగారి మఠం ప్రైవేట్ స్కూల్‌కు చెందిన వ్యక్తులు జిరాక్స్ చేసి వాటిని మరో వ్యక్తికి ఫార్వార్డ్ చేయడంతో ఆ వ్యక్తి రసూల్ అనే జిరాక్స్ సెంటర్‌కు తీసుకువెళ్ళి జిరాక్స్ చేయించుకుంటుండగా మరో కొంత మంది ఆ జిరాక్స్‌ను తీసుకొని యూట్యూబ్ ఛానల్‌లో ప్రచారం చేశారని, దీనిపై బి.మఠం ఎస్ఐ, మైదుకూరు రూరల్ సీఐ నరేంద్ర రెడ్డి ధర్యాప్తు చేపట్టగా మేకల గంగాధర్ అనే వ్యక్తి దగ్గర తీసుకొని ప్రచారం జరిగినట్లుగా డిఎస్పీ తెలిపారు. దీని వెనక పూర్తిస్థాయిలో విచారించగా బి.మఠం ప్రైవేట్ స్కూల్‌కు చెందిన రామాంజనేయులు, సుబ్రమణ్యం, బాలరాజు వారి దగ్గరి నుండి మైక్రో జిరాక్స్ తయారై బయటికి వెళ్ళినట్లుగా సమాచారం వచ్చిందన్నారు. వీరిని విచారించగా వారు చేసిన నేరాలను ఒప్పుకున్నట్లుగా వారు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. లీకేజీ విషయంలో మైదు కూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, బ్రహ్మంగారిమఠం ఎస్ఐ విద్యా సాగర్ విచారణలో భాగంగానే గుట్టురట్లయినట్లు వారిని కడప ఎస్పీ అభినందించినట్లు డిఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మూర్తి, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ప్రారంభం

పోరుమామిళ్ళ రూరల్, ఏప్రిల్ 6ప్రభాతవార్త:



బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానాన్ని స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ఎస్. వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఎ. ఉదయకిరణ్‌ల ఆధ్వర్యంలో ప్రజానాయకులు, మండల జడ్పీటిసి సభ్యులు సంగటి దావీద్, స్థానిక బి. కోడూరు సర్పంచ్ కొండామునిరెడ్డిలు కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి 104 వాహనంపై పూలు చల్లుతూ కరచాల ధ్వనులతో వాహనాన్ని ముందుకు నడుపుతూ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి టి. నరసింహారెడ్డి, కె. నాగమణి, పుష్పాంజలి, ల్యాబ్ టెక్నిషియన్ చంద్రశేఖర్

## రైల్వే పరిసరాల్లో ప్రయాణికులు జాగ్రత్తలు వహించాలి

### ఎస్ఐ చంద్రనాయక్

నందలూరు, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

నందలూరు రైల్వేకేంద్రం నందు ఉన్న రైల్వేగేటు, రైల్వేస్టేషన్ పరిసరాల్లో ప్రయాణికులు జాగ్రత్తలు వహించాలని ఆర్‌పిఎఫ్ ఎస్ఐ చంద్రనాయక్ తెలిపారు. గురువారం ఆయన పిడబ్ల్యుఐ సురేష్‌తో కలిసి రైల్వేగేటు వద్ద వచ్చిపోయే ప్రయాణికులకు సూచనలు ఇవ్వడం జరిగింది. గేటు వేసి ఉన్నప్పుడు అది తెరిచే వరకు ఆగి వెళ్లాలని, గేటుకింద నుంచి దూరి వెళ్లడం నేరమన్నారు. రైల్వే యాక్ట్ అండర్ సెక్షన్ 147 ప్రకారం నేరమని, అలాగే వెళుతున్న రైళ్లపై రాళ్లు విసరడం, పట్టాలపై రాళ్లు పెట్టడం వంటివి చేస్తే రైల్వే యాక్ట్ అండన్ సెక్షన్ 153 కింద 5 సంవత్సరాలు జైలుశిక్ష పడుతుందని అక్కడున్న ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అందువల్ల రైల్వే ఆస్తులకు ఇబ్బంది కలిగించకుండా మీకు ఎటువంటి అపాయాలు కగలకుండా జాగ్రత్తలు పాటించాలని ఈ సందర్భంగా ఆర్‌పిఎఫ్ ఎస్ఐ చంద్రనాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, శివదత్తకుమార్‌లు పాల్గొన్నారు.

## సకల గుణాలకు గుణాలకు అర్థం శ్రీరాముడు

### సీతారాముల కళ్యాణం ఉత్సవంలో పంతగాని

చిట్వేలి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



సృష్టిలోని సకల గుణాలకు అర్థం శ్రీరాముడు అని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్ అన్నారు. చిట్వేలి మండల పరిధిలోని సి.కందులవారి పల్లెలో గురువారం జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి గ్రామ మండల టిడిపి సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు, గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఆయన హాజరయ్యారు. తాను మాట్లాడుతూ నరుడిగా పుట్టి లోకానికి నడవడికను నేర్పిన భగవత్ స్వరూపమే శ్రీరామచంద్రుడు అని అన్నారు. రాష్ట్ర ప్రజల కోసం తెలుగుదేశంపార్టీని స్థాపించి తెలుగువారికి దేవుడంటే తానే అని గుండెల్లో గుడి కట్టుకున్న రూపం దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుదన్నారు. ఆయన ఆశయాలనే ఊపిరిగా ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం ఆలోచించే అలుపెరగని బహుముఖ రాజకీయ దురంధరుడే చంద్రబాబునాయుడని, వారి అవసరం తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉందని ప్రజలందరూ ఆలోచించి ముందుకెళ్లాలన్నారు. గ్రామ ప్రజలు మధ్యాహ్నం అన్నదానం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. పంతగానితో పాటు టిడిపి నాయకులు బొక్కసం సునీల్, సూర్యప్రకాష్‌నాయుడు, కాకర్ల నాగార్జుననాయుడు, బిసి నాయకుడు అమర్‌నాథ్, కూని చంద్రయ్య, పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ ప్రజలు, యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మండల సమావేశం

జమ్మలమడుగు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



పెద్దముడియం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కడప జిల్లా మలేరియా అధికారిణి మరియు మండల నోడల్ అధికారి మనోరమ అధ్యక్షతన వైద్య ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు మరియు ఇతర అధికారులకు మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆదేశాల మేరకు గర్భవతుల నమోదు, రక్త పరీక్షలు, అనిమియా నివారణ కోసం తీసఉకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సమీక్షలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారి అభివృద్ధి వెంకటరమణ, మండల అధికారి జ్యోతి, రత్నకుమారి, రాజేశ్వరిదేవవి, వైద్యాధికారులు గాయత్రి, షరీసా బేగం, డా.ఉసేని, సీహెచ్‌వో నిజాముద్దీన్, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటరమణ, శాంతకుమారి, సుజాత, ఆరోగ్య కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తాపానికి ఉపశమన కార్యక్రమాలు చేపడతాం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :



వేసవికాలంలో ప్రజల వేసవి తాపానికి ఉపశమన కార్యక్రమాలు చేపడతామని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ అన్నారు. పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో గురువారం సాధారణ సమావేశంలో రెండో వైస్‌ఛైర్మన్ హాఫీజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పురపాలిక పరిధిలోని వివిధ ప్రధాన రహదారుల్లో ఆరు మంచినీటి చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవికాలం ముగిసే వరకు వీటిని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శ్రీశ్రీశ్రీ దప్పిలేశ్వరి అమ్మవారి సన్నిధిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 06 ప్రభాతవార్త :



మండల పరిధిలోని నక్కలగండి సమీపంలో వెలసి వున్న శ్రీశ్రీశ్రీ దప్పిలేశ్వరి అమ్మవారి సన్నిధికి విదేశీయులు, టూరిస్ట్‌లు విచ్చేసి గురు పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి శ్రీ సాయి వసుధ ట్రస్ట్ ఛైర్మెన్ సొదరి వెంకటసుబ్బా రెడ్డి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా ప్రత్యేక అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మెన్ సొదరి వెంకటసుబ్బా రెడ్డి మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా అమ్మవారి దర్శనానికి ఇతర రాష్ట్రాల నుండి విచ్చేసిన భక్తులకు అమ్మవారి దర్శనం గావించి వారి పేరుపై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు, అంతే కాకుండా శ్రీరామ నవమి కల్యాణ వేడుకలు ఒంటిమిట్ట ప్రాంతంలో నిర్వహించిన సందర్భాన్ని ఉద్దేశించి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా అమ్మవారి సన్నిధికి విచ్చేసిన పొరుగు రాష్ట్రాల వారికి తీర్థ ప్రసాదాలతో పాటు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు. శ్రీరామ నవమి పురస్కరించుకొని శ్రీరాముని కథలతో పాటు అమ్మవారి కథలను కూడా భక్త జనులకు వినిపించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అడ్వకేట్ కృష్ణ, శ్రీ సాయి వసుధ ట్రస్ట్ మేనేజర్ ఆరిఫ్ బాష, బీరం వెంకట సుబ్బారెడ్డి, సత్యమూర్తి, రాజానాయుడు, రామసుబ్బారావు, నిమ్మకాయల రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవితో పాటు స్థానిక భక్తులు, పొరుగు రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథకాలను నలుమూలలకు వ్యాప్తి చెందాలి

### ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను దాదాపు 95 శాతం పైగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందని, జగనన్నే మా భవిష్యత్తు అని రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆయన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల కిలోమీ టర్లు నడిచి పేదలు పడుతున్న బాధలను గుర్తించిన అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం నిరంతరం వైసిపి కార్యకర్తలు ముఖ్యమంత్రి అభిమానులు, రాజశేఖర్‌రెడ్డి అభిమానులు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, సుధాకర్‌రాజు, కిషోర్‌రెడ్డి, జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు, రమేష్, సిద్ధయ్య, నాగేంద్ర, సర్పంచ్‌లు నాయిని హరిక్రిష్ణారెడ్డి, ఆనాల కవితాచెంగల్‌రెడ్డి, దొమ్మరాజు సుబ్రమణ్యంరాజు, గోపి, సుదర్శన్ రాజు, కొప్పల శంకరయ్య, కరిముల్లా, మహేశ్వర్‌రెడ్డి, బత్తల సుబ్రమణ్యం, రమణారెడ్డి, రాజారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యామల రాజా తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి మృతదేహం లభ్యం

దువ్వూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:



మండల పరిధిలోని చిన్నబాకరాపురం గ్రామంలో 4వ తేదీ కనిపించకుండా పోయిన బాలుడు నరేష్(9) మృతదేహం అతని ఇంటికి సమీపంలో లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. నరేష్ 4వ తేదీ కనిపించకుండా పోవడంతో బంధువులు, తల్లిదండ్రులు సమీప గ్రామాల్లో వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో 5వ తేదీన దువ్వూరు పోలీసుస్టేషన్‌లో ఎస్సై రాఘవేంద్రరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు గాలించారు. ఎక్కడా ఆచూకీ కనిపించలేదు. 6వ తేదీ ఉదయం నరేష్ తల్లిదండ్రుల ఇంటికి సమీపంలోని మరో ఇంటి వద్ద శవమై కనిపించాడు. తండ్రి ఇంటికి సమీపంలోని వెంకటరమణ ఇంటి వద్ద ఇంటి స్లాబ్ కింద చుంచు భాగాన కింద పడిపోయి నల్లగా కమిలిపోయి ఉన్నట్లు గుర్తించారు. ఇంటి యజమాని వారి తల్లిదండ్రులకు తెలపగా వారు చూసి మృతదేహం తమ బాలుడిదే అని గుర్తించారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, సీఐ నరేంద్రరెడ్డి, ఎస్సై రాఘవేంద్రరెడ్డిలు పరిశీలించారు. ప్రస్తుతం అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత విచారణ జరిపిస్తామన్నారు. 9 సంవత్సరాల బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

## ఫలితాలలో శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల ప్రభంజనం

రాయచోటి, ఏప్రిల్ 6ప్రభాతవార్త:



యూనివర్సిటీ ప్రకటించిన ఫలితాలలో శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రబంజనం సృష్టించారు. గురువారం యూనివర్సిటీ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థుల మొదటి సెమిస్టర్ ఫలితాలను విడుదల చేయగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల నుంచి ప్రథమ ర్యాంక్ మానసప్రియ, ద్వితీయ ర్యాంక్ పావని, తృతీయ ర్యాంక్ సాయికుమారిలు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన అత్యుత్తమ ఫలితాలు సాధించారని శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సినత్రీన్ 82.13శాతంతో మొదటి ర్యాంకు, పి. అనిత 82.03 శాతంతో రెండో ర్యాంక్, సి. సాయితేజ్ 83.04 శాతంతో మూడవ ర్యాంక్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి ఎన్. మానసప్రియ 89.01 శాతంతో మొదటి ర్యాంకు, ఎన్. పావని 87.00 శాతం రెండవ ర్యాంక్, డి.సాయి కుమారి 86.02 శాతంతో మూడవ ర్యాంక్ సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలిపారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎ. కార్తీకేయన్, అధ్యాపకులను అభినందించారు.

## ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి

వేంపల్లె, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :



జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది సహకరించాలని పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. వేంపల్లెలోని ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో గురువారం ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందితో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునాదులు వేయాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి పనులు మొదలు పెట్టేలాగ చూడాలని కోరారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు సరిగా జరగడం లేదన్నారు. వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు కూడా సహకరించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, మండల ప్రత్యేకాధికారి రవీంద్రారెడ్డి, ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ ఏఈ సుక్రమ్‌రెడ్డి, గ్రామ సచివాలయ ఇంజినీర్లు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

### ఉద్యోగాలు ఇచ్చేందుకు 80 కంపెనీలు రాక

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త



రాజంపేటలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జాబ్‌మేళాపై సమీక్ష సమావేశం సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపి మిథున్‌రెడ్డి సహాయ సహకారాలతో ఈనెల 15న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్యూస్‌కార్ప్ ఆధ్వర్యంలో మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెగా జాబ్‌మేళాలో 80 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మెగా జాబ్‌మేళాలో విప్రో, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, హెటీరో డ్రగ్స్, అరబిందోఫార్మా, బైజూస్, కియా మోటార్ తదితర కంపెనీలు రానున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్, పిజి చదివిన 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళాలలో ఎంపికైతే నెలకు 12 వేల నుండి 50 వేల వరకు జీతం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు జాబ్‌మేళాకు వచ్చేటప్పుడు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, 2 ఫొటోలు తీసుకురావాలని కోరారు. నిరుద్యోగులకు జాబ్‌మేళా రోజు భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9740212687, 9885797909, 91475836 మొబైల్ నంబర్లలో సంప్రించాలని కోరారు. సబ్‌కలెక్టర్ పర్మాన్‌అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ నిరుద్యోగులకు సువర్ణ అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డి, తహశిల్దారు ఎంవి సుబ్రమణ్యంరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ ఆదిచెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం

### గజ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

### బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 06 ప్రభాతవార్త :

మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో వెలసిన శ్రీ ఆదిచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు దేవాదాయ శాఖ ఈవో శివయ్య, ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ వాకమళ్ళ రంగారెడ్డి మరియు మల్లు వసుంధరమ్మ, తుమ్మిశెట్టి వెంకటరమణ, పెదుళ్ళపల్లె సుశీలమ్మ, కృష్ణ కుమారితో పాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితులు రమేష్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం రాత్రి స్వామివారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో ప్రతి సంవత్సరం పట్టణ, పరిసర ప్రాంతాల నుండి విశేష సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకొని కాయా కర్పూరం సమర్పించుకొని మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది. కోరిన కోర్కెలు తీర్చే శ్రీ ఆదిచెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవంలో స్వామివారికి కల్యాణ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, సతీమణి మమత కుటుంబ సభ్యులు సమర్పించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ప్రత్యేక ఉభయదాతలుగా తంగేడుపల్లెకు చెందిన వాకమళ్ళ శేషారెడ్డి, సతీమణి సుభాషిణి, వేముల వెంకటసుబ్బయ్య, సతీమణి సుభద్రమ్మ, పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి గజ వాహనంపైన స్వామివారు మాడ వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. అడుగడుగునా భక్తులు స్వామి వారికి నీరు వారు పోసుకుంటూ కాయా కర్పూరంతో బ్రహ్మరథం పట్టారు. గ్రామోత్సవం వెంబడి గుంతకల్లు బ్యాండు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



**ఆదిచెన్నకేశవ స్వామివారిని దర్శించుకున్న ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ సభ్యులు :**

చెన్నంపల్లె వద్ద వెలసిన శ్రీ ఆది చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో గురువారం సాయంత్రం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజ, వైస్ ప్రెసిడెంట్ మునగాచలమయ్య, ట్రెజరర్ ఇమ్మడిశెట్టి చంద్రశేఖర్‌తో పాటు ప్రముఖ కాంట్రాక్టర్ కుంచాల నాగ మహేశ్వర్ రెడ్డి, వాకమళ్ళ నారాయణరెడ్డి, పంగా చెన్నకృష్ణారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ వాకమళ్ళ రంగారెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజ మాట్లాడుతూ ఆదిచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమాలను ఈ సంవత్సరం గతంలో ఎన్నడూ లేని విధంగా అంగరంగ వైభవంగా నిర్వహించడం ఎంతో సంతోషకరం అన్నారు. ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు ఉండాలని వారు ఆకాంక్షించారు.